RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY



VOLUME: 17 | ISSUE: 271 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 26-4-2026 | Pages: 8 | Rs: 2/-
సంపుటి : 17 | సంచిక : 271 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 26-4-2026 | పేజీలు : 8 | రూ: 2/-

## లోక్ భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు

ఏపీ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు అస్వస్థత

ఆసుపత్రిలో చికిత్స... డిశ్చార్జి

విజయవాడలోని లోక్ భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా పరామర్శ

గవర్నర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి

గవర్నర్ త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్ష



**విజయవాడ, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం రాష్ట్ర గవర్నర్

తరువాయి 2లో..

## మహా జంగిల్‌రాజ్‌కు మృత్యుఘంటికలు

తృణమూల్ గూండాలను ఎవ్వరూ కాపాడలేరు: మోదీ

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ఫలితాల తర్వాత తృణమూల్ గూండాలు దాక్కోవడానికి కూడా చోటుండదని, వారిని ఏ ఒక్కరూ కాపాడలేరని ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. రాష్ట్రంలో అధికార పార్టీ నడుపుతున్న

తరువాయి 2లో..






## కవిత కొత్త పార్టీ.. 'తెలంగాణ రాష్ట్ర సేన'

పని చేయడం కోసమే టీఆర్ఎస్


కేసీఆర్ మన మనిషి కాదు.. మర మనిషి

అమ్మగా పరిణతి చెందుతా...

**హైదరాబాద్, సిటిజన్ టైమ్స్**

తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భవించింది. కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ సభలో పార్టీ పేరును కవిత ప్రకటించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్నారు. జాగృతి కార్యకర్తలు తెలంగాణ సాంస్కృతిక దీపాన్ని పదిలంగా కాపాడుకున్నారని చెప్పారు. "కాళరాత్రిలో కాగడా వలే తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి ఉద్యమ కారులకు వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నాం. ఏ కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో అవి నిజం కాలేదు. ఇవాళ నా జీవితంలో మరిచిపోలేని రోజు అవుతుంది. తెలంగాణ భవిష్యత్ రాసుకోవడానికి మనందరి భాగస్వామ్యం కావాలి. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పింది. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయింది. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించాం. కానీ, రైతులకు

తరువాయి 2లో..



## ఏపీలోని పలు జిల్లాల్లో పెట్రోల్, డీజిల్ కొరత..

## రంగంలోకి దిగిన చంద్రబాబు!

ఉమ్మడి గోదావరి, కర్నూలు, నంద్యాల వంటి జిల్లాల్లో పెట్రోల్ కొరత

ఇబ్బంది పడుతున్న వాహనదారులు, రైతులు

సమస్యను వెంటనే పరిష్కరించాలని సీఎస్, పౌర సరఫరా అధికారులకు సీఎం ఆదేశం

పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తో మాట్లాడిన సీఎం

ఆయిల్ కంపెనీలు, పెట్రోల్ బంకుల యజమానులతో మాట్లాడాలని అధికారులకు సూచన

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రాష్ట్రంలోని ఉమ్మడి గోదావరి, కర్నూలు, నంద్యాల వంటి జిల్లాల్లో పెట్రోల్ బంకులు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తుండటంతో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించి, కీలక ఆదేశాలు జారీ చేశారు. వరి కోతల సమయంలో డీజిల్ దొరక్కపోవడంతో యంత్రాలు

## సీఎం చంద్రబాబు పాత వీడియో వైరల్..

## ఎంత చెప్పినా మారట్లేదని మంత్రి లోకేశ్ ఆగ్రహం

ఉద్యోగం అడిగిన యువకుడికి ఆటో ఇస్తామన్నట్లు తప్పుడు ప్రచారం

ఇది వైసీపీ పనేనంటూ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం

రెండు వేర్వేరు సంఘటనలను కలిపి వీడియో ఎడిట్ చేశారని స్పష్టీకరణ

ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు సంబంధించిన పాత వీడియో ఒకటి మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఉద్యోగం అడిగిన యువకుడికి చంద్రబాబు ఆటో ఇస్తానన్నట్లుగా ఎడిట్ చేసిన ఈ వీడియోపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ

తరువాయి 2లో..






## ఎడిటోరియల్

# బీజేపీ చేతిలో ప్రాంతీయ పార్టీలు కుదేల్

దేశంలో బీజేపీ ఎదుగుతోంది. ఆ ఎదుగుదల కూడా శర వేగంగా ఉంది. 2014 ముందు వరకూ బీజేపీ చాలా సమస్యలు రాజకీయంగా ఎదుర్కొంది. అయితే 2014లో నరేంద్ర మోడీ వంటి చరిష్మా టిక్ లీడర్ అధికారంలోకి రావడంతో బీజేపీ జోరు పెరిగింది. నాటి నుంచి బీజేపీ దేశ రాజకీయాల్లో అత్యంత ప్రముఖ స్థానం అందుకుంటూ చాలా జోరుగా ఎగబాకుతోంది. మూడుసార్లు వరుసగా కేంద్రంలో అధికారంలోకి రావడం అంటే మామూలు విషయం కాదు. ఇక బీజేపీ కాంగ్రెస్ తో తన పోరుని మొదలెట్టి ఆ పార్టీని విపక్షానికే పరిమితం చేసింది. ఇక సిద్ధాంత బద్ధమైన వైరంతో ఉన్న వామపక్షాలు కూడా బీజేపీతో పోటీ పడలేక నీరసించి పోయాయి. బీజేపీ జాతీయ రాజకీయాల్లో వెలుగుతున్న వేళ పశ్చిమ బెంగాల్ త్రిపుర లలో అధికారం కామ్రేడ్స్ చేయి జారింది. ఇక కేరళలో కనుక అధికారం పోతే ఎర్రన్నల రాజకీయానికి పూర్తిగా రెడ్ సిగ్నల్ పడినట్లే అని అంటున్నారు. ఇదిలా ఉంటే దేశంలో మధ్యేవాద పార్టీలుగా ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. ఇందులో కొన్ని జాతీయ పార్టీల నుంచి ముక్కగా బయటపడి ప్రాంతీయంగా శక్తిగా ఎదిగాయి. ఇవే దేశంలో జాతీయ పార్టీలకు పూర్తి మెజారిటీ కేంద్రంలో రాకుండా చేస్తూ ఎక్కడికక్కడ బలపడుతున్నాయి. దీంతో ఒకే దేశం బలమైన కేంద్రం బలమైన జాతీయ పార్టీ అన్న బీజేపీ సిద్ధాంతాలకు ఇక్కడే విఘాతం ఏర్పడింది. దాంతో బీజేపీ కాంగ్రెస్ తో యుద్ధం చేస్తూనే విపక్షంలో ఉన్న ప్రాంతీయ పార్టీల మీద ఫుల ఫోకస్ పెట్టింది. ఫలితంగా మహారాష్ట్రలో శివసేన రెండుగా చీలింది శరద్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీ రెండు ముక్కలు అయింది. యూపీలో మాయావతి బహుజన్ సమాజ్ పార్టీ ఏమీ కాకుండా పోయింది. బీహార్ లో నితీష్ కుమార్ జేడీయూ బీజేపీతో అంటకాగి పూర్తిగా మమేకం అయిపోయింది. ఆర్జేడీ అయితే తుత్తునియలు అయింది దక్షిణాదిన చూస్తే దేవెగౌడ నాయకత్వంలోని జేడీఎస్ బీజేపీకి పక్క వాయిద్యం అయింది. ఏపీలో టీడీపీ జనసేన మిత్రులుగా ఉంటే వైసీపీ పరోక్షంగా సహకారం అందిస్తోంది. తమిళనాడులో అన్నా డీఎంకే బీజేపీ పొత్తుతో ముందుకు సాగుతోంది. ఇక ఢిల్లీలో ఆప్ ఉంది. జాతీయ పార్టీగ ఎదుగుతూ బీజేపీకి ఇబ్బంది పెడుతోంది. దాంతో ఒక్కసారిగా బీజేపీ ఇచ్చిన స్ట్రోక్ కి ఆప్ కి దిమ్మ దిరిగి బొమ్మ కనిపించినట్లు అయింది. ఆప్ లో వచ్చిన నిట్ట నిలువు చీలికతో కేజ్రీవాల్ కి భారీ షాక్ తగిలినట్లే. ఇప్పటికే ఏడాది క్రితం అధికారం పోగొట్టుకుని మాజీ సీఎం అయిన కేజ్రీవాల్ కి ఏకంగా ఏడుగురు రాజ్యసభ ఎంపీలు బీజేపీలో చేరడం కోలుకోలేని విషయం. జైలు జీవితం కూడా చూసిన ఆప్ కి ఇప్పట్లో రాజకీయ ఎదుగుదల అన్నది కూడా ఒక ప్రశ్నగా మారుతోంది అని అంటున్నారు. గుజరాత్ లో వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆప్ కి ఢిల్లీలో ఏదో విధంగా కూడదీసుకుందామని చూస్తున్న చీపురు పార్టీకి కమలం వేసిన దెబ్బ రీ సౌండ్ మాదిరిగా చెవుల్లో గింగుర్లు పెడుతోంది అని అంటున్నారు. అయితే బీజేపీ ముందు ఇంకా కొన్ని టార్గెట్లు ఉన్నాయని అంటున్నారు. పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీని ఓడించాలి. తమిళనాడులో డీఎంకే స్టాలిన్ ని మాజీని చేస్తే ప్రాంతీయ ప్రత్యర్థి శేషం పూర్తి అవుతుందని అంటున్నారు. అదే విధంగా 2027లో యూపీలో పోటీ పడుతున్న ఎస్పీ సంగతి కూడా తేల్చాల్సి ఉంది. ఇవి కనుక పూర్తి అయితే దేశంలో ప్రాంతీయ పార్టీల శకం దాదాపుగా పూర్తి అవుతుంది అని అంటున్నారు. దేశంలో అపుడు ఏదైనా ప్రాంతీయ పార్టీ ఉంటే బీజేపీకి మిత్రుడిగా ఉండడమో లేదా విలీనం కావడం తప్ప శరణ్యం లేదని అంటున్నారు. 2029 తరువాత చాలా ప్రాంతీయ పార్టీలు దేశంలో కనుమరుగు అవడం ఖాయమని అంటున్నారు. అందులో తెలుగు నాట కూడా ప్రాంతీయ పార్టీలు ఉన్నాయని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# కవిత కొత్త పార్టీ.. 'తెలంగాణ రాష్ట్ర సేన'

బేడీలు పడ్డాయి.. ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు

**పని చేయడం కోసమే టీఆర్ఎస్**

ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం.. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బతికింది. మనం అనుకున్న తెలంగాణ రాలేదనేది ముమ్మాటికీ వాస్తవం. ఆనాడు పరిపాలించిన కుటుంబంలో నేను కూడా ఒక భాగం. అందుకే కొన్ని విషయాల్లో సిగ్గుపడుతున్నా. తెలంగాణ ప్రజలను క్షమించాలని కోరుతున్నా. తెలంగాణ సాధించినందుకు చాలా గర్వపడుతున్నా. జన్మధన్యమైందని భావిస్తున్నా. కానీ, తప్పులో నాకూ భాగం ఉన్నందుకు క్షమాపణ చెబితే సరిపోదు. సామాజిక తెలంగాణ కోసం నడుం బిగించి కష్టపడి పని చేయాలి. పని చేయడం కోసమే తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) ప్రజల ముందుకు వచ్చింది. మా పని తీరు ఎలా ఉంటుందో ప్రజలు చూస్తారు. ప్రజలకు మంచి చేయాలంటే పోరాడితే సరిపోదు.. రాజకీయ అధికారం ఉండాలి. అది తోడైతేనే ప్రజలకు మంచి చేయగలం. ఏ పార్టీకైనా ఆత్మ, నేపథ్యం ఉండాలి. బీఆర్ఎస్ సాంకేతికంగా ఉన్నా ఆత్మను కోల్పోయింది. బీఆర్ఎస్ ఆత్మ కోల్పోయినందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చింది.

**కేసీఆర్ మన మనిషి కాదు.. మర మనిషి**

నాటి టీఆర్ఎస్ కోసం నా రక్తం, చెమట, సమయం ధారపోశా. పార్టీ బలోపేతం కోసం పని చేశా. ఆనాటి కేసీఆర్ వేరు.. ఇప్పటి కేసీఆర్ వేరు. చేనేత కార్మికులు చనిపోతుంటే.. ఆనాటి కేసీఆర్ భిక్షాటన చేశారు. ఇవాళ్టి కేసీఆర్ మారిన మనిషి.. మర మనిషి.. మన మనిషి కాదు. ఎక్కడ చిన్న కష్టం వచ్చినా ఆ సార్ రారు.. ఎందుకంటే ఆయన మారిన మనిషి. గుంటనక్కలు, తోడేళ్ల చేతిలో కేసీఆర్ ఖైదీ అయ్యారు. పంజాబ్, గుజరాత్, బిహార్ వెళ్లి జాతీయ పార్టీ పెట్టాలని చూశారు. కేంద్రంతో గొడవ పెట్టుకోకుండా ఉండి ఉంటే పాలమూరు పూర్తయ్యేది. నేను ఎన్ని మాట్లాడినా బీఆర్ఎస్ నేతలు బయటకు వచ్చి జవాబివ్వట్లేదు. సమాధానం చెప్పకపోతే.. ప్రజలే బయటకు లాగి జవాబు చెప్పేలా చేస్తారు.

**అమ్మగా పరిణతి చెందుతా**

తెలంగాణలోని 3.5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్నా. అమ్మతనంతో పాలన చేస్తేనే బిడ్డలకు కష్టం వస్తే తీరుస్తుంది. తెలంగాణలో ఏళ్ల తరబడి భూస్వామ్య వ్యవస్థ నడిచింది. ఎందరో మహనీయులు పోరాడితే కొంత సమానత్వం వచ్చింది. మలిదశ ఉద్యమంలో కేసీఆర్, ఉద్యమకారులు పోరాడితే కొత్త రాష్ట్రం వచ్చింది. రాజకీయ శక్తితో పోరాటాలు మిళితం చేసి సామాజిక న్యాయ తెలంగాణ సాధిస్తాం. భాజపాకి రాష్ట్ర ఏర్పాటే ఇష్టం లేదు. 'తల్లిని చంపారు.. పిల్లను బతికించారని' ఒకరు అన్నారు. భారత్, పాక్ విడదీసినట్లు తెలుగు రాష్ట్రాలను విభజించారని మరో ఎంపీ చెప్పారు. అయినా, భాజపా బానిస ఎంపీలు ఒక్క మాట మాట్లాడలేదు.

**భాజపా ఎంపీలకు సవాల్**

తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే భాజపా ఎంపీలు మాట్లాడరు. విభజన హామీలు నెరవేర్చకపోతే భాజపా ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి భాజపా. తెలంగాణ భాజపా ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలి" అని కవిత అన్నారు.

## సీఎం చంద్రబాబు పాత వీడియో వైరల్..

# ఎంత చెప్పినా మారట్లేదని మంత్రి లోకేశ్ ఆగ్రహం

తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోందని, ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. విషయం ఏమిటంటే.. మార్చి 30న నాయుడుపేట పర్యటనలో సీఎం చంద్రబాబు లబ్ధిదారురాలైన అంబిక ఇంటికి వెళ్లారు. ఆమె భర్త ఆటో డ్రైవర్ కావడంతో అతనికి బ్యాటరీ ఆటో కొనివ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఆ తర్వాత బయటకు వచ్చినప్పుడు మరో మహిళ తన చదువుకున్న కుమారుడికి ఉద్యోగం ఇప్పించాలని కోరారు. అయితే, కొందరు ఈ రెండు వేర్వేరు సంఘటనలను కలిపి, ఉద్యోగం అడిగితే చంద్రబాబు ఆటో కొనిస్తానని హామీ ఇచ్చినట్లుగా తప్పుడు అర్థం వచ్చేలా వీడియోను ఎడిట్ చేసి ప్రచారం చేస్తున్నారు. ఈ దుష్ప్రచారంపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ... "వైసీపీ తన పాత అలవాటు మార్చుకోవడం లేదు. నాయుడుపేటలో రెండు వేర్వేరు సందర్భాల్లో జరిగిన విషయాలను కలిపి, సీఎంపై అపహాస్యం చేసేలా వీడియోను సృష్టించారు. తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. ఈ వీడియోపై గతంలోనే ఏపీ ఫ్యాక్ట్ చెక్ విభాగం వివరణ ఇచ్చిందని, అయినప్పటికీ మళ్లీ అదే వీడియోతో దుష్ప్రచారం చేయడం దారుణమని ఆయన మండిపడ్డారు.

## ఏపీలోని పలు జిల్లాల్లో పెట్రోల్, డీజిల్ కొరత..

# రంగంలోకి దిగిన చంద్రబాబు!

పొలాల్లోనే నిలిచిపోయాయి. అటు ఆక్వా రైతులు కూడా ఏరియేటర్ల నిర్వహణకు డీజిల్ లేక తీవ్ర ఆందోళనలో ఉన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిణామాల వల్ల అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరగడంతో ఆయిల్ కంపెనీలు సరఫరాను నియంత్రించాయి. దీనికి తోడు కంపెనీలు క్రెడిట్ ఆప్షన్‌ను రద్దు చేయడం, పాత బకాయిలు ఉన్న బంకులకు స్టాక్ నిలిపివేయడం ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. పెట్రోల్, డీజిల్ సమస్య తీవ్రతరం అవుతుండటంతో, సీఎం చంద్రబాబు రంగంలోకి దిగారు. సమస్యను తక్షణం పరిష్కరించాలని సీఎస్, పౌరసరఫరాల అధికారులను సీఎం ఆదేశించారు. పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తో కూడా మాట్లాడారు. స్టాకు లేని బంకుల వివరాలను వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ కంపెనీలు, పెట్రోల్ బంకుల యజమానులతో మాట్లాడాలని సూచించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని, వినియోగదారులు ఇబ్బంది పడకుండా చూసుకోవాలని చెప్పారు. మరోవైపు, పెట్రోల్ స్టాక్ సమస్య ఉంటే వెంటనే ఆ బంక్ వారు 1967 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేయాలని కమిషనర్ సూచించారు.

# పోలీసులకు ఫిర్యాదు ఎలా చేయాలి?




పోలీసులకు ఫిర్యాదు చేయడం ప్రతి పౌరుని హక్కు మాత్రమే కాదు, భద్రతకు కీలకమైన బాధ్యత కూడా. అయితే ఫిర్యాదు సరైన విధంగా, స్పష్టంగా వ్రాయడం చాలా ముఖ్యం. ఒక అధికారిక ఫిర్యాదు లేఖ ఎలా ఉండాలి, ఏ వివరాలు తప్పనిసరిగా ఇవ్వాలి, మరియు పోలీసులు స్పందించకపోతే తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యలు ఏమిటో ఈ ఆర్టికల్‌లో క్షుణ్ణంగా తెలుసుకుందాం. ప్రజల భద్రత కోసం పోలీసులకు ఫిర్యాదు చేయడం అత్యంత కీలకమైన హక్కు. అయితే చాలా మందికి ఫిర్యాదు లేఖను ఎలా రాయాలో, ఏ వివరాలు ఇవ్వాలో స్పష్టత లేకపోవడం సాధారణం. సరైన పద్ధతిలో వ్రాసిన ఫిర్యాదు మాత్రమే వేగవంతమైన చర్యలకు దారితీస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. పోలీసులకు వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలంటే ముందుగా లేఖను అధికారికంగా సిద్ధం చేయాలి. లేఖ ప్రారంభంలో ఫిర్యాదుదారు తన పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్ వంటి వివరాలు తప్పనిసరిగా పేర్కొనాలి. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్.హెచ్.ఓ) లేదా జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ( ఎస్పీ )కు లేఖను ఉద్దేశిస్తూ "సర్/మేడమ్" అని గౌరవప్రదంగా ప్రారంభించాలి. లేఖలో "విషయం" భాగంలో ఫిర్యాదు కారణాన్ని స్పష్టంగా తెలియ జేయాలి. ఉదాహరణకు దొంగతనం, బెదిరింపులు, మోసం లేదా ఇతర నేరాలు. తరువాత ప్రధాన భాగంలో సంఘటనకు సంబం ధించిన పూర్తి వివరాలు ఇవ్వాలి. సంఘటన జరిగిన తేదీ, సమ యం, స్థలం, సంబంధిత వ్యక్తుల వివరాలు మరియు సంఘటన ఎలా జరిగింది అనే విషయాలను క్షుణ్ణంగా వివరించాలి. అలాగే ఈ సంఘటన వల్ల జరిగిన నష్టం కూడా స్పష్టంగా పేర్కొనాలి.

ఫిర్యాదు చివరలో పోలీసుల నుంచి ఆశిస్తున్న చర్యలను స్పష్టంగా తెలియజేయాలి. ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, దర్యాప్తు చేపట్టడం, నిందితులపై చర్యలు తీసుకోవడం వంటి అంశాలను పేర్కొనడం అవసరం. అనంతరం మర్యాదపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతూ సంతకం చేయాలి. చట్టపరంగా, గతంలో సీఆర్పీసీ సెక్షన్ 154 ప్రకారం గుర్తించదగిన నేరాలపై కేసులు నమోదు చేయాల్సి ఉండేది. ప్రస్తుతం అమల్లో ఉన్న కొత్త చట్టం బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 173 ప్రకారం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపడతారు. అయితే, కొన్ని సందర్భాల్లో పోలీసులు ఫిర్యాదు స్వీకరించకపోతే బాధితులకు చట్టపరమైన మార్గం ఉంది. సీఆర్పీసీ సెక్షన్ 200 లేదా ప్రస్తుతం బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 223 ప్రకారం న్యాయస్థానంలో ప్రైవేట్ కంప్లైంట్ దాఖలు చేయవచ్చు. దీని ద్వారా కోర్టు జోక్యం చేసుకుని కేసు నమోదు చేయించే అవకాశం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో న్యాయవాది సలహా తీసుకోవడం ద్వారా సరైన మార్గంలో ముందుకు వెళ్లవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. సరైన వివరాలతో, చట్టపరమైన అవగాహనతో ఇచ్చిన ఫిర్యాదు న్యాయం సాధించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

**కేసులో ఉదాహరణ :**

2013లో లలితా కుమారి వర్సెస్ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం కేసు లో ఒక చిన్నారి అపహరణకు గురైన ఘటనలో ఆమె కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. బాధిత కుటుంబం పలుమార్లు పోలీసులను సంప్రదించినా స్పందన లేకపోవడంతో చివరకు కోర్టును ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. గుర్తించదగిన నేరం గురించి సమాచారం అందిన వెంటనే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఫిర్యాదు నమోదు చేయకుండా ఆలస్యం చేయడం చట్టవిరుద్ధమని పేర్కొంది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా పోలీసులపై బాధ్యత మరింత కఠినమైంది. ఈ ఘటన ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తోంది. పోలీసులు ఫిర్యాదు తీసుకోకపోతే, బాధితులు నిరాశ చెందాల్సిన అవసరం లేదు. ఉన్నతాధికారులను సంప్రదించడం లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించడం ద్వారా న్యాయం సాధించవచ్చు.

**జె. కనక దుర్గ లక్ష్మీ**
**ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ (IHR)**
**ఉత్తరాంధ్ర ఇంచార్జి**

## మొదటి పేజీ తరువాయి

### లోక్ భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు

ఎస్. అబ్దుల్ నజీర్‌తో భేటీ అయ్యారు. విజయవాడలోని లోక్ భవన్‌లో గవర్నర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవలే స్వల్ప అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి సీఎం ఆరా తీశారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను పరామర్శించిన చంద్రబాబు, ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, విధులకు హాజరు కావాలని ఆకాంక్షించారు. అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేరిన గవర్నర్, చికిత్స అనంతరం కోలుకుని లోక్ భవన్‌కు తిరిగి వచ్చారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆయన్ను పరామర్శించేందుకు వెళ్లారు. ఈ భేటీ కేవలం మర్యాదపూర్వక పరామర్శ మాత్రమేనని అధికార వర్గాలు తెలిపాయి.

### మహా జంగిల్‌రాజ్‌కు మృత్యుఘంటికలు

మహా జంగిల్‌రాజ్ అంతం కాబోతోందని, తొలి దశ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో నమోదైన పోలింగ్‌తో దానికి మృత్యు ఘంటికలు మోగాయని ఆయన పేర్కొన్నారు. భాజపా ప్రభుత్వం ఏర్పడగానే ప్రజలకు అధికార పార్టీ చేసిన ప్రతి అన్యాయం, అరాచకం మీద ఫైల్స్ తెరుస్తామని, ఇది మోదీ ఇస్తున్న గ్యారంటీ అని ఆయన వ్యాఖ్యానించారు. రెండో దశ ఎన్నికల ప్రచారంలో భాగంగా జాదవ్‌పుర్, దమ్‌దమ్, పానిహాటి తదితర ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన ర్యాలీల్లో మోదీ తృణమూల్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తల్లికి బిడ్డను దూరం చేశారు: ఆర్జీకర్ హత్యాచార ఘటనపై మోదీ మాట్లాడుతూ.. కుమార్తెను వైద్యురాలిని చేయాలన్న కలతో ఆమె తల్లి చదువుకోవడానికి పంపించిందని, అయితే జంగిల్‌రాజ్ అరాచకాలకు ఆ బిడ్డ బలైందన్నారు. తృణమూల్ మహిళా వ్యతిరేక పార్టీ అని, భాజపా మాత్రం ఆ తల్లికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిందన్నారు.

**హుగ్లీ నదిలో మోదీ పడవ షికారు**

ప్రధాని మోదీ గంగానదికి ఉపనది అయిన హుగ్లీలో శుక్రవారం పడవ షికారు చేశారు. కెమెరా చేతపట్టి నది అందాలను బంధించారు. తన పడవ షికారు చిత్రాలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ పడవ నిర్వాహకుడు మహమ్మద్ ఇఫ్తికర్ అహ్మద్‌తో మోదీ కాసేపు సంభాషించారు.

### ఇరాన్ అణ్వాయుధాల తయారీని ఆపేవరకు.. దిగ్బంధంలోనే హర్మూజ్



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ నౌకల రాకపోకలపై అమెరికా కట్టుదిట్టమైన దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. ఈవిషయంపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ (ఫ్రావవ ఎవస్త్రంవిష్ఠ) మాట్లాడుతూ.. జలసంధిపై నియంత్రణను మరింత కాలం పొడిగిస్తామన్నారు. హర్మూజ్ చుట్టూ అమెరికా నేవీ దిగ్బంధనాన్ని ఉక్కు కవచంతో పోల్చారు. ఇది శాశ్వత దిగ్బంధనంగా మారే అవకాశమూ ఉందని హెచ్చరించారు. టెహ్రాన్ తన అణ్వాయుధాల తయారీని విడనాడే వరకు ఆ దేశంపై ఒత్తిడి తెస్తూనే ఉంటామన్నారు. అంతర్జాతీయ స్థిరత్వానికి ఇరాన్ నుంచి పొంచి ఉన్న ముప్పును తొలగించడానికే తాము ఈ సాహసోపేతమైన, ప్రమాదకరమైన మిషన్‌ను చేపట్టామన్నారు. తమ అనుమతి లేకుండా హర్మూజ్‌లోకి ఏ రవాణా నౌక రాదని.. బయటకు వెళ్లదని పీట్ హెగ్సెత్ అన్నారు. జలసంధిలోని నౌకలపై దాడులు చేస్తూ.. టెహ్రాన్ సముద్రపు దొంగల ముఠాలా ప్రవర్తిస్తోందన్నారు. తన చర్యలతో సముద్ర భద్రతను అస్థిరపరుస్తోందని ఆరోపించారు. తమ దిగ్బంధనం గల్ఫ్ దాటి విస్తరిస్తోందన్నారు. అంతర్జాతీయ వాణిజ్యాన్ని కాపాడడానికి తాము ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటామన్నారు. ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ పరోక్ష చర్చలకు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో హెగ్సెత్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు హర్మూజ్ దిగ్బంధనం ప్రారంభమైనప్పటినుంచి 34 నౌకలను వెనక్కి పంపినట్లు అమెరికా జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ డాన్ కెయిన్ వెల్లడించారు. ఇటీవల తమ ఆదేశాలను ధిక్కరించిన ఇరాన్ నౌకపై కాల్పులు జరిపి.. అందులోని సిబ్బందిని తమ దళాలు అదుపులోకి తీసుకున్నాయన్నారు. హర్మూజ్ మాత్రమే కాకుండా హిందూ, పసిఫిక్ మహాసముద్రాల్లోనూ ఇరాన్ నౌకలను అడ్డగించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# ఐదు రివార్డులతో సీపీ సత్కారం...
# సేవలో శిఖరాగ్రం వైపు సీఐ దివాకర్ యాదవ్

**మహారాణి పేట, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :25**

ప్రజల భద్రతే పరమావధిగా, విధి నిర్వహణలో నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తున్న మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్ మరోసారి తన ప్రతిభను చాటుకున్నారు. నేర నియంత్రణలో దిట్టగా, మహిళల రక్షణలో ముందుండే అధికారిగా ఆయనకు విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బగ్చీ ప్రశంసలు కురిపిస్తూ ఏకకాలంలో ఐదు రివార్డులను ప్రదానం చేయడం విశేషం. పోలీస్ కమిషనరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ సత్కారం జరిగింది. సాధారణంగా ఒకే రివార్డు అందుకోవడం గర్వకారణమైతే, ఒకేసారి ఐదు రివార్డులు అందుకోవడం సీఐ దివాకర్ సేవల స్థాయిని స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. దివాకర్ యాదవ్ తన విధుల్లో చూపుతున్న చురుకుదనం, ప్రజల పట్ల ఉన్న స్పందన, నేరస్తులపై కఠిన వైఖరి ఆయన్ను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. జగదాంబ కూడలి వద్ద జరిగిన ఘటనలో వేగంగా స్పందించి నిందితులను అరెస్ట్ చేయడం, పొరుగు రాష్ట్రాల వరకు వెళ్లి గంజాయి నిందితులను పట్టుకొచ్చిన సాహసం ఆయన ధైర్యసాహసాలకు నిదర్శనం. మహిళల భద్రత విషయంలో ఆయన తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం. అర్ధరాత్రి వేళల్లో బీచ్ ప్రాంతాల్లో ఆత్మహత్యాయత్నాలకు దిగిన పలువురిని స్వయంగా వెళ్లి కాపాడడం ద్వారా మానవత్వాన్ని చాటారు. బాధితులకు న్యాయం చేయడంలో ఆయన చూపుతున్న కట్టుదిట్టమైన వైఖరి కారణంగా ప్రజల్లో ఆయనపై







విశ్వాసం మరింత పెరిగింది. ఇటీవల భవానీ అనే మహిళా హెడ్ కానిస్టేబుల్ సమస్యను పరిష్కరించడం సహా అనేక సందర్భాల్లో సీఐ దివాకర్ న్యాయం సాధించి చూపారు. అప్పులు ఎగ్గొట్టే వారు, మహిళలపై ఆర్థిక నేరాలకు పాల్పడే వారిపై ఆయన సింహస్వప్నంలా మారి కఠిన చర్యలు తీసుకుంటున్నారు. సీఐ దివాకర్ నాయకత్వంలో పని చేస్తున్న బృందం కూడా సమర్థవంతంగా పనిచేస్తుండటంతో, స్టేషన్ పనితీరు గణనీయంగా మెరుగుపడింది. ఆయనను సత్కరిస్తూ సీపీ బాగ్చీ "ఇలాంటి అధికారులు పోలీస్ శాఖకు ఆభరణాలు" అని కొనియాడారు. భవిష్యత్తులో మరింత ఉన్నత బాధ్యతలు చేపట్టి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సహచర పోలీసులు, స్టేషన్ సిబ్బంది, ప్రజలు సీఐ దివాకర్ యాదవ్‌ను అభినందించారు. ఆయన సేవా దృక్పథం, కర్తవ్యనిబద్ధత, ధైర్యసాహసాలు పరిగణనలోకి తీసుకుంటే, త్వరలోనే ఉన్నత పదవికి పదోన్నతి పొందే అవకాశాలు ఉన్నాయని పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రజల కోసం పనిచేసే నిజమైన పోలీస్ అధికారిగా సీఐ దివాకర్ యాదవ్ పేరు విశాఖ నగరంలో మారుమోగుతోంది.

## విశాఖ బార్ ఎన్నికల్లో నమ్మి సన్యాసిరావు అధ్యక్షుడిగా విజయం

### కార్యదర్శి గా ఒమ్మి సుధాకర్





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :25**

విశాఖ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో నమ్మి సన్యాసిరావు అధ్యక్షుడిగా, ఒమ్మి సుధాకర్ జనరల్ సెక్రటరీగా గెలుపొందారు. ఏప్రిల్ 24న జరిగిన పోలింగ్‌లో సన్యాసిరావు తన సమీప ప్రత్యర్థి శిష్ట శ్రీనివాసమూర్తిపై 203 ఓట్ల మెజారిటీతో విజయం సాధించగా, సుధాకర్ ఏ. సోమేశ్వరరావుపై 117 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. వైస్ ప్రెసిడెంట్‌గా పీలా మీనాక్షి, ట్రెజరర్‌గా సనపల బాలకృష్ణ, జాయింట్ సెక్రటరీగా గాలి రామిరెడ్డి, లైబ్రరీ సెక్రటరీగా బాలరాణి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా సురేష్ బాబు ఎన్నికయ్యారు. సీనియర్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యుల లెక్కింపు ఇంకా కొనసాగుతోంది. మొత్తం 2174 మంది ఓటర్లలో 1589 మంది ఓటు హక్కు వినియోగించారు. అయితే తీవ్ర ఎండల మధ్య తగిన సౌకర్యాలు లేకపోవడంతో ఎన్నికల ఏర్పాట్లపై న్యాయవాదులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ఆదివాసి పవిత్ర ప్రదేశాలను కాపాడుకోవాలి

**- 200 ఏళ్ల వయసున్న చింతమానుకు పూజలు**

**- పి మల్లిఖార్జునరావు, ఏపి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు**



**చింతపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 25**

ఆదివాసీ పవిత్ర ప్రదేశాలను కాపాడుకోవాలి అని ఎపి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి మల్లిఖార్జునరావు కోరారు. శుక్రవారం ఆయన సిఫా ట్రస్ట్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ ల నేతృత్వంలో అల్లరి సీతారామరాజు జిల్లా లో చింతపల్లి మండలం లంబసింగి పంచాయతీ నూతిబంద, రావి మాను పాకల, కొయ్యూరు మండలం డౌనూరు వద్ద ఉన్న పవిత్ర ప్రదేశాలను సుందర్శించారు. నూతిబంద వద్ద ఉన్న అరవై ఏళ్ల నాటి నేరేడు వృక్షాలను సందర్శించి ఆదివాసీలు తమ సంస్కృతిక విధానంలో పూజలు నిర్వహించారు. అదే విధంగా రావి మాను పాకల గ్రామం వద్ద ఉన్న 60 సంవత్సరాల నాటి మామిడి వృక్షం దగ్గర, డౌనూరు వద్ద ఉన్న 200 సంవత్సరాల చింత మాను దగ్గర ఆయా ఆదివాసీల ఆచారం ప్రకారం పవిత్ర పూజలు నిర్వహించారు. మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ఆదివాసీల పవిత్ర ప్రదేశాలను భవిష్యత్తు తరాల కోసం పదిలంగా ఉంచాలని కోరారు. మూడు గ్రామాల్లోనే కాదు ప్రతి ఆదివాసీ గ్రామాల వద్ద ఉన్న పవిత్ర ప్రదేశాలను పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజు, చింతపల్లి డిఎఫ్ఒ వైవి నరసింహారావు, ఎఫ్ ఆర్ ఒ బి అప్పారావు, డౌనూరు ఎస్ఒ జి అనీల్ కుమార్, సిఫా ట్రస్ట్ సిఇఒ డాక్టర్ శశిప్రభ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, అటవీ శాఖ సిబ్బంది, సిఫా ట్రస్ట్, అటవీ శాఖల సిబ్బంది, ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అనకాపల్లిలో మెగా జాబ్ మేళా గోడ పత్రిక ఆవిష్కరణ




**అనకాపల్లి జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :25**

అనకాపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా గోడ పత్రికను శనివారం అనకాపల్లి లోని పార్టీ కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ జాబ్ మేళా మే 5, 2026 (మంగళవారం) నాడు కశింకోటలోని ఆర్.ఈ.సి.ఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించబడుతుంది. సుమారు 15 ప్రముఖ కంపెనీలు పాల్గొననున్న ఈ మేళా ద్వారా స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ అర్హతలతో, 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్. గోవిందరావు, ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవి సెలవుల్లో పిల్లల భద్రతపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి


### అంతర్జాతీయ మానవహక్కుల సంస్థ ఉత్తరాంధ్ర ఇంచార్జి జె. కనక దుర్గ లక్ష్మీ సూచనలు

**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ : 25**



వేసవి సెలవులు వచ్చాయంటే పిల్లల ముఖాల్లో ఆనందం మెరిసిపోతుంది. పాఠశాల ఒత్తిడి నుంచి విముక్తి, ఆటలు, సరదా కార్యక్రమాలు, ఇవన్నీ ఈ కాలాన్ని ప్రత్యేకంగా మార్చేస్తాయి. కానీ ఈ ఆనందం మధ్యే కనిపించకుండా దాగి ఉండే ప్రమాదాలను తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకూడదని అంతర్జాతీయ మానవహక్కుల సంస్థ ఉత్తరాంధ్ర ఇంచార్జి జె. కనక దుర్గ లక్ష్మీ స్పష్టం చేశారు. పిల్లల హక్కులు, భద్రత, ఆరోగ్యం కాపాడటం ప్రతి కుటుంబం యొక్క ప్రధాన బాధ్యత అని ఆమె తెలిపారు. వేసవిలో ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు సన్‌స్ట్రోక్, డీహైడ్రేషన్ వంటి సమస్యలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆమె హెచ్చరించారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా చూడటం, తరచూ నీరు, మజ్జిగ, పండ్లరసాలు ఇవ్వడం, తేలికపాటి దుస్తులు ధరింపజేయడం వంటి చర్యలు తప్పనిసరి అని పేర్కొన్నారు. చిన్నపిల్లలను ఒంటరిగా బయటకు పంపకూడదని, వారి కదలికలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఇక డిజిటల్ యుగంలో మరో పెద్ద సవాల్‌గా మారిన స్క్రీన్ వ్యసనం పట్ల కూడా ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. సెలవుల పేరుతో గంటల తరబడి మొబైల్ ఫోన్లు, టీవీలు, వీడియో గేమ్స్‌లో మునిగిపోతున్న పిల్లలపై తల్లిదండ్రులు నియంత్రణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. బదులుగా పుస్తక పఠనం, చిత్రలేఖనం, క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలకు ప్రోత్సహిస్తే పిల్లల మానసిక, శారీరక వికాసం సమతుల్యంగా జరుగుతుందని ఆమె చెప్పారు. సైబర్ భద్రత విషయంలో కూడా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. తెలియని వ్యక్తులతో ఆన్‌లైన్‌లో మాట్లాడకూడదని, వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దని పిల్లలకు ముందుగానే అవగాహన కల్పించాలన్నారు. అవసరమైతే పేరెంటల్ కంట్రోల్ యాప్స్ ఉపయోగించడం ద్వారా పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను పర్యవేక్షించవచ్చని తెలిపారు. పిల్లల వ్యక్తిత్వ వికాసానికి వేసవి సెలవులు ఉత్తమ అవకాశం అని జె. కనక దుర్గ లక్ష్మీ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో సమయం గడపడం, సంస్కారం, విలువలు నేర్పించడం, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించడం ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. అంతేకాకుండా, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, ఎవరిని సంప్రదించాలి అనే విషయాల్లో కూడా పిల్లలకు సరైన మార్గదర్శనం ఇవ్వాలని సూచించారు. "పిల్లల నవ్వు కాపాడటం అంటే వారి భద్రతను కాపాడటం" అని ఆమె పేర్కొంటూ, తల్లిదండ్రులు కొంచెం శ్రద్ధ, కొంచెం సమయం కేటాయిస్తే వేసవి సెలవులు పిల్లల జీవితంలో మధురమైన జ్ఞాపకాలుగా మిగులుతాయని అన్నారు. మొత్తానికి, వేసవి సెలవులు పిల్లలకు కేవలం విశ్రాంతి సమయం మాత్రమే కాదు వారి ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తును తీర్చిదిద్దే కీలక దశ. తల్లిదండ్రుల జాగ్రత్తలే పిల్లల సంతోషానికి నిజమైన రక్షణగా నిలుస్తాయి అని ఆమె తెలిపారు.

## 24X7 కంట్రోల్ రూమ్‌తో ప్రజలకు సహాయం : కలెక్టర్ టి.నిషాంతి



**అల్లూరి జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :25**

జిల్లాలో గ్రామ, మండల స్థాయి సమస్యలు మరియు విపత్కర పరిస్థితుల్లో ఉత్పన్నమయ్యే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ టి.నిషాంతి ఐఏఎస్ ఆదేశాల మేరకు ఈ కంట్రోల్ రూమ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రజలు తమ సమస్యలను ఎప్పుడైనా తెలియజేయడానికి ఈ సదుపాయం ఉపయోగపడనుంది. అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు లేదా ఇతర సమస్యలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులు, సమస్యలను తెలియజేయడానికి 08935 293448 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చు. జిల్లా ప్రజలు ఈ సేవను వినియోగించుకోవాలని జిల్లా యంత్రాంగం కోరుతోంది.

## గంజాయి రవాణాపై కట్టడి

### నిందితుడు జైలుకు - అనకాపల్లి జిల్లా పోలీస్



**నర్సీపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 25**

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు అనకాపల్లి జిల్లా పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ ఆదేశాల మేరకు, నర్సీపట్నం సబ్ డివిజన్ అధికారి పి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో కీలక ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలో నర్సీపట్నం రూరల్ సర్కిల్ పరిధిలోని గొలుగొండ మండలం రావణపల్లి గ్రామానికి చెందిన గొర్లి గంగు నాయుడుచిన్న (28) అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతను వృత్తిరీత్యా డ్రైవర్ కాగా, గత కొంతకాలంగా అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి అనకాపల్లి మరియు ఇతర ప్రాంతాలకు గంజాయిని అక్రమంగా తరలిస్తూ వరుస నేరాలకు పాల్పడుతున్న హ్యాబిచువల్ ఆఫెండర్‌గా గుర్తించారు. ఇతనిపై గతంలో గొలుగొండ, పాయకరావుపేట పోలీస్ స్టేషన్లతో పాటు ప్రకాశం జిల్లా టంగుటూరు పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. గంజాయి తరలింపు కేసుల్లో పలుమార్లు అరెస్టై జైలుకు వెళ్లి వచ్చినప్పటికీ, అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడం గమనార్హం. సమాజం మరియు ప్రజారోగ్యంపై అతని చర్యలు తీవ్రమైన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పిట్ ఎన్.డి. పి. ఎస్ చట్టం, 1988 కింద ప్రివెంటివ్ డిటెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆపరేషన్‌ను నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో గొలుగొండ ఎస్సై రామారావు, ఎన్.డి.పి.ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ పిల్లా రమేష్ మరియు సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించి, నిందితుడిని అదుపులోకి తీసుకుని జైలుకు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో గంజాయి వ్యాపారంపై నిరంతర నిఘా కొనసాగుతుందని, చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా పునరావృత నేరాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చట్టాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు.

# విధి నిర్వహణలోనే విషాదం

### హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ మృతి -ఎస్పీ తుహిన్ సిన్హా దిగ్భ్రాంతి





**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :25**

విధి నిర్వహణకు వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అనకాపల్లి జిల్లా స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ కె.పి.ఆర్.వి.ఎన్. ప్రసాద్ (హెచ్‌సీ-3585) మృతి చెందడం విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రతి శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే స్పెషల్ బ్రాంచ్ వారాంతపు సమీక్ష సమావేశానికి హాజరుకావడానికి ప్రసాద్ గారు సుజాతనగర్ నుండి అనకాపల్లికి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. సబ్బవరం మండలం ఇరువాడ వద్ద (ఆనందపురం--తుని జాతీయ రహదారి-16) ప్రయాణిస్తున్న సమయంలో, వెనుక నుండి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఘటన స్థలంలోనే ఆయన ప్రాణాలు కోల్పోయారు. 2000 బ్యాచ్‌కు చెందిన ప్రసాద్ గారు విశాఖపట్నం సిటీలో కానిస్టేబుల్‌గా సేవలు ప్రారంభించారు. తన సుదీర్ఘ సేవలో 2వ టౌన్, 4వ టౌన్ శాంతిభద్రతల విభాగాలు, హార్బర్, స్టీల్ ప్లాంట్, పెందుర్తి ట్రాఫిక్, ఎం.వి.పి కాలనీ క్రైమ్ మరియు విశాఖపట్నం సిటీ స్పెషల్ బ్రాంచ్ విభాగాల్లో కర్తవ్య నిబద్ధతతో పనిచేశారు. 2022లో జిల్లాల పునర్విభజన అనంతరం అనకాపల్లి జిల్లాకు బదిలీ అయి, పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో సేవలు అందిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమాచార సేకరణలో ఆయన చూపిన చొరవ, నిబద్ధత పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచింది. ఇటీవల ఆయన కుమారుడు చదువులో ప్రతిభ కనబరిచినందుకు ఎస్పీ చేతుల మీదుగా నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకోవడం విశేషం. ఆ ఆనందం మరువకముందే ఈ విషాదం చోటుచేసుకోవడంతో సహచరులు, స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. నిబద్ధత కలిగిన అధికారి, మంచి వ్యక్తిని కోల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి పోలీస్ శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందని అధికారులు హామీ ఇచ్చారు.

# భీమనపల్లి-1 రైతు సేవా కేంద్రం ఆకస్మిక తనిఖీ

## జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ నిధియా దేవి





**ఉప్పలగుప్తం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 25**

ధాన్యం సేకరణలో జాప్యం జరిగినా లేదా రైతుల నుండి ఫిర్యా దులు అంది నా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ వైఖోమ నిధియాదేవి కొనుగోలు సిబ్బందిని హెచ్చరించారు. ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలనీ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి వైఖోమ నిధియా దేవి, ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ నిధియా దేవి శనివారం ఉప్పలగుప్తం మండలం, భీమనపల్లి-1 లోని రైతు సేవా కేంద్రం నందు నిర్వ హిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి కొనుగోలు ప్రక్రియను తేమ శాతాన్ని పరికరాల ద్వారా పరిశీలించి అనంతరం రికార్డులు ఆధారంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా ఆమె ధాన్యం సేకరణకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో అమలవుతు న్న ప్రక్రియపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, మరింత వేగంగా పనులు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.తనిఖీలో భాగంగా జాయిం ట్ కలెక్టర్ సేకరణ ద్వారా రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన తమ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.ప్రస్తుతం కోత కోసిన వరి ధాన్యానికి సంబంధించి కొనుగోలు ప్రక్రియను ఏమాత్రం జాప్యం చేయకుండా తక్షణమే వేగవంతం చేయాలని మండల స్థాయి అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు,ధాన్యం కొనుగోలు సిబ్బందిని ఆదేశించారు.మార్గదర్శకాల పారదర్శకం నిష్పక్షపాతంగా అమలు చేస్తూ శిక్షణ తరగతులలో అధికారిక వాట్సాప్ గ్రూపులలో జారీ చేసిన ప్రతి సూచనలను ఖచ్చితంగా పాటించా లన్నారు నిబంధనల అతిక్రమణను సహించ బోమని ఆమె స్పష్టం చేశారు.రైతులకు ధాన్యం కొనుగోలు, సేకరణలో అండగా నిలుస్తూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల మేరకు ధాన్యం సేకరణ సజావుగా సాగేలా చూడాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ పి శ్రీనివాసరావు జిల్లా వ్యవసాయ శాఖాధి కారి ఎం.వి.రామారావు జిల్లా సహకార శాఖాధికారి రాధాకృష్ణ మరియు ఇతర మండల స్థాయి అధికారు లు

## అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ హరీష్ బాలయోగి





**కాట్రేనికోన సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 25**

డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం అవిడిపేట, దొంతుకుర్రు గ్రామంలో, తాళ్లరేవు మండలం పెదబాపనపల్లిలో జరిగిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకల్లో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, ఆయన సేవలను స్మరించుకోవడం జరిగింది.

## సప్త శనివార వ్రతము పుస్తక ఆవిష్కరణ

**మామిడి కుదురు సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 25**

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానంలో స్వామివారి సన్నిధిలో అమలాపురం, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్ వ్రాసిన 'సప్త శనివార వ్రతం' పుస్తకాన్ని ఆలయ ఈ. ఓ రాంబాబు రెడ్డి ఆవిష్కరించారు. గొల్లపూడి వీరాస్వామి పబ్లిషర్స్ వారు ప్రచురించిన ఈ పుస్తకంలో వ్రత విధానము, వేంకటేశ్వరస్వామి,శనేశ్వర మహాత్యాలతో పాటు అప్పనపల్లి బాలాజీ, వాడపల్లి వేంకటేశ్వరస్వామి, చదలవాడ శృంగార వల్లభస్వామి వార్ల క్షేత్ర ప్రాశస్త్యాన్ని కుమార్ శంకర్ గౌడ్ వివరించారు. ఈ సందర్భంగా దేవస్థానం పండితులు కుమార్ శంకర్ గౌడ్ కు వేద ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సీనియర్ అసిస్టెంట్ మొల్లేటి శ్రీనివాస్, విశ్వహిందూపరిషత్ లోకా స్సమస్తా స్సుఖినో భవంతు ఆధ్యాత్మిక సేవా సంస్థల ప్రతినిధులు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, గొవ్వాల నాగరాజు, ఆత్మారామ్,రేలంగి లోకేష్, కూనపరెడ్డి రాము,బొక్కా ప్రకాశరావు, ఆర్. ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



### రైతు సంక్షోభానికి వైసీపీ కారణం...

# అభివృద్ధికి కూటమి మార్గం

**- అబద్ధాల ప్రచారంతో రైతులను మోసం చేసిన వైసీపీ**

**- కూటమి పాలనలో రికార్డు స్థాయికి దూసుకెళ్తున్న వ్యవసాయం**

**అమరావతి (సిటిజన్ టైమ్స్) ఏప్రిల్ 25**

వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధాల పునాది మీద నిలిచినవని, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం రైతుకు వెన్నుదన్నుగా నిలిచి గిట్టుబాటు ధరలు, సమయానికి విత్తనాలు, ఎరువులు, నీటి పారుదల సదుపాయాలు అందిస్తూ వ్యవసాయాన్ని బలోపేతం చేస్తుంటే, వైసీపీ నేతలు మాత్రం వాస్తవాలను వక్రీకరించి అబద్ధాల ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. వైసీపీ పాలనలో రైతులు అప్పుల భారంతో నలిగిపోవడం, పంటలకు సరైన ధరలు దక్కక రోడ్డెక్కిన ఘటనలు ప్రజలు మర్చిపోలేదని, ఆ కాలంలో వ్యవసాయం క్షీణించి రైతులు తీవ్ర నష్టాలు చవిచూశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎం ఎస్ పి అమలులో కట్టుబడి ధరల స్థిరీకరణ నిధి ( పి ఎస్ ఎఫ్ ) ద్వారా రైతులను ఆదుకుంటూ 2025--26లో రూ.300 కోట్ల కేటాయిస్తే సుమారు రూ.588 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అందులో పోగాకు (రూ.240 కోట్లు), మామిడి (రూ.190 కోట్లు), ఉల్లి కొనుగోలు (రూ.17.20 కోట్లు), ఉల్లి నష్టపరిహారం (రూ.128.33 కోట్లు), కోకో (రూ.12 కోట్లు) వంటి పంటలకు ప్రత్యక్ష మద్దతు అందించామని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో కేటాయింపులు ఉన్నా ఖర్చు చేయకుండా తప్పుడు లెక్కలు చూపించి రైతులను మోసం చేశారని దుయ్యబట్టారు. 25 వేలు ఉన్న ఉల్లి నష్టపరిహారాన్ని హెక్టారుకు రూ.50 వేల వరకు పెంచి రైతులకు ఉపశమనం కల్పించామని, ప్రస్తుతం మొక్కజొన్న సమస్యపై కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో నిరంతరం చర్చలు జరుపుతూ రైతులకు అనుకూల నిర్ణయం తీసుకురాబోతున్నామని వెల్లడించారు. 2019--2024 మధ్య ఆహార ధాన్యాల ఉత్పత్తి 143--175 లక్షల మెట్రిక్ టన్నుల మధ్యే నిలిచిపోయి 2023-24లో 143 లక్షల టన్నులకు పడిపోవడం వైసీపీ వైఫల్యాన్ని బట్టబయలు చేస్తుండగా, 2024 తర్వాత కూటమి పాలనలో 163 లక్షల టన్నుల నుంచి 2025-26లో 237 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగి సుమారు 51% వృద్ధి నమోదు కావడం వ్యవసాయ రంగంలో సంభవించిన మార్పుకు నిదర్శనమని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యాన రంగంలో కూడా చరిత్రాత్మక పురోగతి సాధిస్తున్నామని పేర్కొంటూ,




మైక్రో ఇరిగేషన్‌లో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. 2014-19లో 6.58 లక్షల హెక్టార్లతో పోలిస్తే, వైసీపీ కాలంలో అమలు తగ్గిపోగా, కూటమి ప్రభుత్వం వచ్చాక వేగవంతం చేసి 2024-26 మధ్య లక్షల హెక్టార్లలో డ్రిప్, స్ప్రింక్లర్ సదుపాయాలు కల్పించామని తెలిపారు. గత ప్రభుత్వం వదిలిన బకాయిల్లో రూ.881 కోట్లు చెల్లించడంతో పాటు, ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంచుతూ, +వాూను రూ.1.52 లక్షల కోట్లకు చేర్చామని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ మేరకు రాయలసీమను గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని, ఆయిల్ పామ్ సాగులో రాష్ట్రం దేశంలో అగ్రస్థానంలో ఉందని, కొత్త విస్తరణకు భారీ ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం, ఆదాయం పెంపు, వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని, వాస్తవాలు తెలుసుకోకుండా అబద్ధాలు ప్రచారం చేసే వైసీపీ నేతల మాటలను ప్రజలు తిప్పికొడతారని మంత్రి అచ్చెన్నాయుడు ఘాటుగా హెచ్చరించారు.

# ఉపరాష్ట్రపతి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

## హెలిప్యాడ్‌ల పరిశీలన - కలెక్టర్, ఎస్పీ సమీక్ష





**శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 25**

భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ జిల్లాకు ప్రతిపాదిత పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను వేగవంతం చేసింది. ఈ సందర్భంగా డచ్‌బంగ్లా, పోలీసు క్వార్టర్స్ మైదానాల్లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి శుక్రవారం పరిశీలించారు. వీవీఐపీ భద్రతా నిబంధనలకు అనుగుణంగా అవసరమైన చోట అదనపు హెలిప్యాడ్‌ల ఏర్పాటుపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పర్యటనలో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అరసవల్లి, శ్రీకూర్మం ఆలయాల వద్ద భద్రత, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని, కాన్వాయ్ మార్గంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీ రాజ్ ఉత్తమ సేవా పురస్కారాలు





**అమలాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 25**


జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో విశేష సేవలు అందించిన అధికారులకు కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ శుక్రవారం ఉత్తమ సేవా పురస్కారాలను అందజేశారు.జిల్లా పంచాయతీ అధికారి డి. శాంతలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అమలాపురం డి ఎల్ పి ఓ పి.బొజ్జిరాజు,జిల్లా రిసోర్స్ పర్సన్ సింగంపల్లి దుర్గా శ్రీను లకు ఉత్తమ సేవా పురస్కారాలను కలెక్టర్ మహేష్ కుమార్ అందజేశారు.ఉత్తమ సేవా పురస్కార గ్రహీతలను పంచాయతీరాజ్ విభాగానికి చెందిన డిప్యూటీ ఎంపీడీవో రుద్రరాజు ఎస్ ఎస్ సూరపరాజు,పి.ఆదినారాయణ, పి.శ్రీనివాస్, అడబాల ఎస్వీఎస్ రాజేశ్వరరావు,బుజ్జిరాజు, దార రామకృష్ణ,సామా కృష్ణ, డి.నాగబాబు,తదితరులు అభినందనలతో ముంచెత్తారు...

## కాకినాడలో ఇంధన సంక్షోభం

**- పెట్రోల్, డీజిల్ కోసం బంకుల వద్ద బారులు తేరిన వాహనదారులు**








**కాకినాడ జిల్లా సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 25**

కాకినాడ నగరంలో పెట్రోల్ మరియు డీజిల్ కొరత ఉందనే వార్తలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొంతమంది బంకుల్లో ఇంధనం ఇచ్చినప్పటికీ, రాత్రి సమయానికి దాదాపు అన్ని పెట్రోల్ బంకులు మూసివేయడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. బంకుల వద్ద "దీఖచీఖ జూూజుణ" బోర్డులు పెట్టడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అడిగితే రేపు ఉదయం ఇంధనం ఇస్తామని సిబ్బంది చెబుతున్నారని ప్రజలు అంటున్నారు. దీంతో చాలా మంది బంకుల దగ్గరే వేచి ఉండగా, మరికొందరు పెట్రోల్ లేక వాహనాలను నెట్టుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాయంత్రం వరకు కొట్టిన బంకులు కూడా రాత్రికి మూసివేయడంతో నగరంలో ఇంధన కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా పెట్రోల్ కోసం మాత్రమే కొంతమంది బంకులు పరిమితంగా ఇస్తుండగా, డీజిల్ పూర్తిగా దొరకకపోవడం వాహనదారులను మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది.ఈ పరిస్థితుల కారణంగా నగరంలో ట్రాఫిక్ సమస్యలు కూడా పెరుగుతున్నాయి. అయితే అధికారులు మాత్రం ఇది తాత్కాలిక సమస్య మాత్రమేనని, త్వరలోనే సరఫరా సాధారణ స్థితికి వస్తుందని చెబుతున్నారు. ప్రజలు ఆందోళన చెందకుండా, అవసరానికి మాత్రమే ఇంధనం వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు.

# కలికిరిలో ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ



**కలికిరి, ఏప్రిల్ 25 సిటిజన్ టైమ్స్**

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మేడికుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ కావ్యగంధ, సామాజిక ఆరోగ్య కేంద్రం కలికిరి వైద్యాధికారులు డాక్టర్ పవన్ కుమార్ మరియు డాక్టర్ ఉదయ్ కిరణ్, డాక్టర్ సిమ్రాన్, డాక్టర్ మెహెజబీన్ తాజ్ డాక్టర్ బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం ర్యాలీ చేయడం జరిగినది. మలేరియా నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయడం జరిగినది. కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రం నుండి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయము వరకు మేడికుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందిచే మలేరియా. నిర్మూలన నినాదాలతో ర్యాలీ నిర్వహించడం జరిగినది.మలేరియా మరియు ఇతర కీటక జనిత వ్యాధులపై అవగాహన కలిగించడం జరిగినది. ఈ కార్యక్రమం లో మలేరియా సబ్ యూనిట్ అధికారి ముజీబ్ బాషా, హెల్త్ సూపెర్వైజర్ లు సుధాకర్, గిరిజమ్మ,టీబీ సీనియర్ ట్రీట్మెంట్ సూపెర్వైజర్ నాగిరెడ్డి, ఏ ఎన్ ఎమ్ లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రంగాపురంలో రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు



**లింగపాలెం (సిటిజన్ టైమ్స్ ) ఏప్రియల్ :25**

ఏలూరు జిల్లా లింగపాలెం మండలం రంగాపురం గ్రామంలో శ్రీ భూనీలా సహిత సత్యనారాయణ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాలు నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ దీపాల వెలుగుల కాంతులతో ఆలయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రేపటి నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, స్వామివారిని పెళ్లి కుమారుని చేయుట, వాహన సేవలు నిర్వహించుచున్నారు.

# పార్టీ సిద్ధాంతాలను యువత ప్రజల్లోకి తీసుకెళ్లాలి

*యువనేత బందారు సంజీవ్ ..*





**కొత్తపేట సిటిజెన్ టైమ్స్ ఏప్రిల్ 25**

కొత్తపేట మండల తెలుగు యువత సమావేశం మండల తెలుగు యువత అధ్యక్షుడు ఇళ్ళ రాము అధ్యక్షతన శనివారం కొత్తపేటలో జరిగింది. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ యువత ఉపాధి కోసం కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఉన్నత విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు చేస్తున్న కృషి ప్రశంసనీయం అన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థమెరుగుపడితే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి...అందుకే ఆ దిశగా ఉన్నత విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు ప్రయత్నం చేస్తున్నారు.. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలకు సమర్థులైన విద్యావంతుల్ని వైస్ ఛాన్స్ లర్లుగా నియమించి పలువురు ప్రశంసలు పొందారు.. గత వైసిపి ప్రభుత్వం విద్యావ్యవస్థలో నియామకాలన్నీ రాజకీయ ప్రేరేపితంగా ఉండేవి.. నేడు ఆ వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా లోకేష్ పని తీరు ఉంది. ఇక పార్టీలో కష్టపడిన వారిని గుర్తించాలనేది పార్టీ సిద్ధాంతం. తెలుగుదేశం పార్టీ అనేది ఒక వ్యవస్థ. మనం అందరం ఆ వ్యవస్థలో భాగం,ఎన్నికల్లో విజయం సాధించాలంటే పార్టీ సిద్ధాంతాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మనం కోరుకున్న మార్పు సాధ్యం కావాలంటే అందరం కలిసికట్టుగా పనిచేయాలని సంజీవ్ కోరారు. సమావేశంలో కొత్తపేట నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు భావన శ్రీనివాస్, కొత్తపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, ప్రధాన కార్యదర్శి కదలి భీమా తదితరులు పాల్గొన్నారు.

# అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ ఏప్రియల్ 25**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజవర్గం అయినవిల్లి మండలం అయినవిల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విధులలో ఉత్తమ సేవలు అందించిన సందర్భంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం రోజున డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అయినవిల్లి డిప్యూటీ ఎంపీడీవో శ్రీవాణి బెహరా, వెలవలపల్లి గ్రామ పంచాయతీ గ్రామాభివృద్ధి అధికారి జి. సూరిబాబు, అయినవిల్లి డిప్యూటీ ఎంపీడీవో కంప్యూటర్ ఆపరేటర్ యర్రా హిమ బిందు లకు అవార్డును జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్వీకరించినారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీల అభివృద్ధి అధికారులు, మండల ప్రజా పరిషత్తు పరిపాలనాధికారి లక్ష్మి, ఇతర సిబ్బంది, గ్రామపంచాయతీల కాంట్రాక్ట్ కార్మికులు, సిబ్బంది, గ్రామపంచాయతీలో వివిధ కేటగిరీల సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు ఘనంగా వీరిని సన్మానించారు. ఈ సందర్భంగా



సన్మానం పొందిన సన్మానకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ పరిపాలనాధికారి లక్ష్మి, గౌరీ శంకర్, రాజబాబు, టైపిస్ట్ బాలామణి, గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారుల సంఘ అధ్యక్షులు కాకరపర్తి బులి వీరన్న, ఇతర పంచాయతీల గ్రామాభివృద్ధి అధికారులు కె.రామచంద్రరావు,అన్వర్ మహమ్మద్, మంగన్న,తదితర గ్రామాభివృద్ధి అధికారులు, సిబ్బంది,



కాంట్రాక్ట్ కార్మికులు గుండ్రు సత్యనారాయణ, సుంకర కోటేశ్వరరావు, కోలా నాగబాబు, పోతుకూరి శ్రీను, జార్జి, ఇతర పంచాయతీ కార్మికులు,ఐ. పోలవరం పంచాయతీ అభివృద్ధి అధికారి గిడుగు వెంకట సూర్యనారాయణమూర్తి, కంప్యూటర్ ఆపరేటర్లు శేఖర్, సుబ్బలక్ష్మి, కామేశ్వరి, శ్రీదేవి, సత్య, ఎస్డబ్ల్యుసి కిరణ్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు ఘన సన్మానం చేసారు.

# తలసరి ఆదాయం పెంపు- మౌలిక సదుపాయాల కల్పన

**బాలయోగి స్టేడియం అభివృద్ధికి 30 కోట్లు**

**త్రాగునీరు సరఫరా వాటర్ గ్రిడ్ పథకం కింద రూ. 1650 కోట్లు మంజూరు**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్**



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 25**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల ద్వారా తలసరి ఆదాయం పెంపుకు పలు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పేట వేసే దిశగా పలు ప్రతిపాదనలు రూపొందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నందు పాత్రికేయుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ జిఎంసి బాలయోగి స్టేడియం అభివృద్ధికి 30 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించామని, స్థానిక రైతు బజారు అభివృద్ధికి కోటి రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. త్రాగునీరు సమృద్ధిగా సరఫరా చేసేందుకు వాటర్ గ్రిడ్ పథకం రూ. 1650 కోట్లతో మంజూరయిందని తద్వా రా ఇప్పటికే నిర్మాణాలు చేపట్టిన 32 ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా సమృద్ధి గా త్రాగు నీరు సరఫరా అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. రోడ్లు కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించి రోడ్లు విస్తరణ ట్రాఫిక్ నియంత్రణ చర్యల కొరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాలలో డంపింగ్ యార్డులు, స్మశాన వాటికలు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు.తడి, పొడి చెత్త నిర్వహణకు స్థానికంగా ప్లాస్మా టెక్నాలజీతో లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ విధానం త్వరలో అమలులోనికి రానున్నదన్నారు.జిల్లాకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను చాలా ముఖ్యమని, యువత సరైన ఆట స్థలాలు స్థానికంగా అందుబాటులో లేక కాలువలు, గోదావరి ఏటిగట్లపై సంచరిస్తూ ప్రమాదాల బారిన పడుతున్న నేపథ్యంలో ప్రతి నియోజకవర్గంలో సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణాలకు ప్రతిపాదిం చామన్నారు. స్థానికంగా ఉన్న ఎలక్ట్రికల్ సమస్యలను పరిష్కరించేందుకు సింగిల్ ఫేస్ కనెక్షన్లను త్రీఫేస్ గా కన్వర్షన్ పనులు దశల వారీగా సీ.ఎం.డి పర్య వేక్షణలో ముమ్మరంగా కొనసాగుతుయన్నారు. జిల్లాలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేం దుకు వీలుగా అయినవిల్లి నందు 400 కె.వి విద్యుత్ కేంద్రం నిర్మాణం దాదాపు పూర్తిగా వచ్చిందని తెలిపారు. దీనికి సంబం ధించి 64 స్తంభాలు నెలకొల్పాల్సి ఉండగా, 40 స్తంభాలను నిర్మించడం జరిగిందన్నారు. తద్వారా భవిష్యత్తులో విద్యుత్ సమస్యలు తొలగి జిల్లాలో త్వరలో 95% విద్యుత్ సమస్యలు తీరతాయని ఆయన వెల్లడించారు. కొబ్బరి ఆకులు పడి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్న దృష్ట్యా జిల్లాలో 500 కిలోమీటర్ల మేర ఇన్సులేటెడ్ విద్యుత్ వైర్ లైన్ లో ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని తద్వారా కొబ్బరి ఆకులు పడిన విద్యుత్ సరఫరాకు ఏమాత్రం అంతరాయం కలుగదని స్పష్టం చేశారు. జిల్లాలో మేజర్ విద్యుత్ లైన్ లకు ఇన్సులేటెడ్ వైర్ల లైన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుం దన్నారు. హైదరాబాదులోని పెద్ద అపార్ట్మెంట్ల తరహాలో ఆక్వాట్రాన్ సెప్టిక్ క్లీన్ విధానం స్థానిక పెద్ద సంఖ్యలో ఉన్న వసతి గృహాలకు అవసరమని గుర్తించి తానేలంక సాంఘిక సంక్షేమ సంక్షేమ పాఠశాల నందు పైలెట్ ప్రాజెక్టుగా ఓఎన్జిసి- సిఎస్ఆర్ నిధులతో చేపట్టడం జరిగిందన్నారు.

తద్వారా అనారోగ్య సమస్యలు 90%.తొలుగు తాయన్నారు. స్థానికంగా ఆక్వా ట్రాన్ విధానం అమలుకు స్వచ్ఛ భారత్ నుండి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వర్యులు కోరడం జరిగిందన్నారు. కోనసీమ ప్రాంతంలో కొబ్బరి సాగు ఎక్కువగా ఉన్నప్పటికీ కేవలం కొబ్బరికాయలు మాత్రమే అమ్ముకునే విధానాలే కాకుండా కొబ్బరి విలువ ఆధారిత కోకో పార్క్ ఏర్పాటుపై సుమారు 100 ఎకరాలు సేకరణకు చర్యలు చేపట్టామన్నారు. తద్వారా స్థానిక కొబ్బరి రైతాంగానికి అదనపు ఆదాయం కచ్చితంగా చేకూరుతుందన్నారు. కోనసీమ ప్రాంతంలోని ప్రాముఖ్యత కలిగిన వంటకాలు ఆహార పదార్థాలు ప్రామాణికరించి నాణ్యమైన రీతిలో విక్రయాలు నిర్వహించేలా కోనసీమ ప్లాటర్ పేరిట నాణ్యమైన తినుబండారాలను విక్రయించేందుకు చర్యలు గైకొంటున్నట్లు తెలిపారు. ఈ ఆహార పదార్థాలపై స్థానికంగా పర్యటించే పర్యాటకులు ఎంతో మక్కువ చూపు తారన్నారు. చేనేత రంగాన్ని విస్తరించి ఫ్యాషన్ టెక్నాలజీ వివిధ రకాల టెక్నాలజీపై అనుసంధానం చేసి జీవనోపాదులు మెరుగుపరిచి అదనపు ఆదాయం లభించేలా మార్కెటింగ్ సౌలభ్యం కల్పిస్తామన్నారు. కోకో పార్కులు వివిధ రంగాల అభివృద్ధి ద్వారా ప్రస్తుతం ఉన్న తలసరి ఆదాయం 2 లక్షలను నుండి పెరిగేందుకు అవకాశాలు మెరుగుప డతాయన్నారు. ఆదాయం ఉపాధి అవకాశాలను జనరేట్ చేయాలని తపనతో ఒక కొబ్బరి కోకో పార్కు ప్లాటెడ్ ప్లాట్ఫారం తయారు చేసి అందిం చేందుకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేశారన్నారు. కేవలం కొబ్బరి తాళ్లు మాత్రమే జిల్లాలో తయారవుతు న్నాయని వాటిని పశ్చిమ బెంగాల్,చెన్నై వారు తమ జ్యూట్ బ్యాగులకు తాళ్లు గా వినియోగిస్తున్నారన్నారు. జియో టెక్స్టైల్స్ ను నిర్మాణ రంగంలో రోడ్లు, కాలుగట్లు స్లాబులలో వినియోగిస్తున్నారని, ఆ దిశగా ప్రభుత్వం నిర్మాణ రంగంలో వీటి వాడకానికి నాణ్యత దృష్ట్యా అవకాశం ఇచ్చిందన్నారు. స్క్వయర్ పార్కులు ఏర్పాటుకు జిల్లాలో మెరు గైన అవకాశాలు ఉన్నాయని,ఆ దిశగా ఇప్పటికే అధ్యయన ప్రక్రియ జిల్లా అధికారులతో నిర్వహించి పార్కు ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయడం జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా రానున్న రోజుల్లో ఓఎన్జిసి మరో 125 గ్యాస్ వెలికి తీసే బోరు బావులను నిర్మించనున్నదని, కోనసీమ ప్రాంతవా సుల రక్షణ దృష్ట్యా కేజీ బేసిన్ జాతీయ స్థాయి బోర్డు సభ్యుడుగా రాష్ట్రాన్ని నుంచి ఒకరికి ప్రాతినిధ్యం కల్పిస్తే వారి కార్యకలాపాలకు సంబంధించి ఈ ప్రాంత వాసులకు ఒక భద్రత రక్షణ సంక్షేమానికై వెసులుబాటు కలిగి భవిష్యత్తు బాగుంటుందని జిల్లా కలెక్టర్ అభిప్రాయపడ్డారు. లేనిపక్షంలో సమన్వయ లోపాలు ఉత్పన్న మవుతాయన్నారు. జనాభా ప్రాతిపదికన స్మశాన వాటికలు,డంపింగ్ యార్డులకు ప్రస్తుతం ఉన్న స్థలాలు కాకుండా ఇంకా 150 ఎకరాలు అవసరం అన్నారు. ప్రతి నియోజక వర్గంలో గోదావరి గట్టు వెంబడి పది దహన పడకలతో అంత్యక్రియల నిర్వహణకు ప్రతిపాదిం చామన్నారు. కాత్రేనికోన మండలం దక్షిణ కాశీగా పేరుగాంచిన కుండ లేశ్వరంలో కాశీ మాదిరిగా ఘాట్ల నిర్మాణానికి ప్రతిపాదించామన్నారు. డీజిల్ కొరత నేపథ్యంలో ఆయిల్ కంపెనీలు వారు తమ డీలర్లకు 10 శాతం అదనంగా డీజిల్ సరఫరా చేయాలని,రాష్ట్ర పౌరసర ఫరాల అధికారులతో ఆదేశాలు ఇప్పించి రాబోయే మూడు రోజులలో సాధారణంగా డీజిల్ సరఫరా అవుతుందని నమ్మకాన్ని కలిగించి సాధారణ పరిస్థితులను నెలకొల్పాలని సూచించామన్నారు. ప్రస్తుత వరి కోత హార్వెస్టింగ్ మిషన్లకు అవసరాల మేరకు డీజిల్ సరఫరా చేయాలనిలేని పక్షంలో దాన్యం సేకరణ వాతావరణ మార్పులు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్ఓ ఏ.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి చోరీ కేసులో కానిస్టేబుల్ డిస్మిస్

**అధికార దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు తప్పవు :ఎస్పీ దామోదర్**


**విజయనగరం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :25**



గంజాయి చోరీ ఘటనలో ఆరోపణలు రుజువుకావడంతో కానిస్టేబుల్ బి. రాంబాబును విధుల నుంచి డిస్మిస్ చేస్తూ జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ ఉత్తర్వులు జారీ చేశారు. శాఖాపరమైన అంతర్గత విచారణలో రాంబాబు నేరానికి పాల్పడినట్లు తేలడంతో ఈ చర్యలు తీసుకున్నారు. ఎస్.కోట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సమయంలో 2022లో సీజ్ చేసిన గంజాయిలో సుమారు 20 కిలోలను చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ ఘటనపై విచారణ పూర్తయ్యాక, నేరం నిర్ధారణ కావడంతో సేవల నుంచి తొలగించారు. పోలీసు విధులు క్రమశిక్షణతో నిర్వహించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, అసాంఘిక శక్తులతో కలసి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. చట్టాన్ని అమలు చేయాల్సినవారే చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడటం తీవ్రమైన నేరంగా పరిగణించినట్లు తెలిపారు. రాంబాబు పై ఎస్.కోట, ఎల్.కోట పోలీస్ స్టేషన్లలో గంజాయి చోరీ కేసులు నమోదై, ప్రస్తుతం కోర్టులో విచారణలో ఉన్నాయి. అలాగే, గతంలో డిస్మిస్ అయిన కానిస్టేబుల్ శివప్రసాద్, మరో కానిస్టేబుల్ సతీష్‌తో కలిసి గంజాయి అక్రమ రవాణాలో పాల్గొంటూ విశాఖపట్నం సిటీ పోలీసులకు ఇటీవల పట్టుబడినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ముగ్గురు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. కానిస్టేబుల్ సతీష్‌పై కూడా శాఖాపరమైన విచారణ కొనసాగుతోందని, ఆరోపణలు రుజువైతే అతనిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. ఇటువంటి నేరప్రవర్తనకు పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.

# భీమిలి బీచ్ రోడ్‌లో ఘోర ప్రమాదం

**- ఇద్దరు యువకులు మృతి**





**భీమిలి, సిటిజన్ టైమ్స్,ఏప్రియల్ :25**

భీమునిపట్నం మండలం పరిధిలోని బీచ్ రోడ్‌పై శనివారం తెల్లవారుజామున జరిగిన ప్రాణాంతక రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసుల సమాచారం మేరకు, గోపాలపట్నం కృష్ణనగర్‌కు చెందిన గంగిరి కుషాల్ కుమార్ (32) టెక్ మహీంద్రా కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన తన స్నేహితుడు ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన షేక్ తౌసీఫ్ (27)తో కలిసి శుక్రవారం రాత్రి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై బయలుదేరారు. శనివారం ఉదయం విశాఖపట్నం నుండి భీమునిపట్నం వైపు వస్తుండగా, ఎర్రమట్టిదిబ్బలు సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. బైక్‌పై ప్రయాణిస్తున్న కుషాల్ కుమార్ వాహనంపై నియంత్రణ కోల్పోయి ముందుగా రోడ్డు సైడ్ డివైడర్‌ను ఢీకొన్నాడు. అనంతరం బైక్ వేగం తగ్గకపోవడంతో డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై సమాచారం అందుకున్న భీమిలి పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను భీమునిపట్నం సీహెచ్‌సీ మార్చ్యురీకి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును ఎస్ఐ జె. సురేష్ విచారిస్తున్నారు. ఈ ప్రమాదంతో గంగిరి కుటుంబంలో విషాదం నెలకొంది. కుషాల్ కుమార్ తండ్రి గంగిరి సోమశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నారు.

# తాగునీటి సమస్యలకు పరిష్కారం

**లింగపాలెం ( సిటిజన్ టైమ్స్ ఏప్రియల్ : 25**

ఏలూరు జిల్లా లింగపాలెం మండలం పాశ్చానగరం పంచాయతీ పరిధిలోగల శ్రీకాకొల్లువారిగూడెం, తాళ్లూరి వారి గూడెం గ్రామాల్లో తాగునీటి సమస్యకు కూటమి నాయకులు పరిష్కారం చూపారు. శనివారం ప్రత్యేక అధికారిని వాణి ఆధ్వర్యంలో, కే.గోకవరం సొసైటీ చైర్మన్ రవి, టిడిపి నాయకులు ఉదయ్ సహకారంతో వెంటనే స్పందించి కొత్త మోటర్ ను ఏర్పాటు చేయించారు.ఈ వేసవి లో తాగునీటి సమస్య తీరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ కూటమి నాయకులకు, కార్యకర్తలకు, పీఏసీ చైర్మన్ రవి కి, ప్రత్యేక అధికారిని వాణి కి, కృతజ్ఞతలు తెలిపారు.



# జిల్లాలో డీజిల్ సరఫరాపై ఆందోళన వద్దు

## జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 25**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో డీజిల్ కొరత ఉందంటూ వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ శనివారం ఒక ప్రక టనలో అన్నారు గతంలో కంటే సాధారణంగానే సరఫరా జరుగుతున్నప్పటికీ, సామాజిక మాధ్యమాలలో మరియు ఇతర మాధ్యమాల్లో వస్తున్న అవాస్తవ, అసత్య ప్రచారాల వల్ల ప్రజలు భయాందోళనకు గురై, అవసరానికి మించి డీజిల్‌ను నిల్వ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీనివల్ల కృత్రిమ కొరత ఏర్పడుతోందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.?డిమాండ్ పెరగడానికి ప్రధాన కారణాలుగా? వ్యవసాయ అవసరాలు ఉన్నాయని జిల్లా పూర్తిగా వ్యవసాయ ఆధారితం కావడంతో, ప్రస్తుతం వరి కోతల సమయం కావడంతో కోత యంత్రాలకు ఒక్కసారిగా డీజిల్ అవసరం పెరిగిందన్నారు.?ఆక్వా కల్చర్ రంగానికి విద్యుత్ కోతల నేపథ్యంలో రొయ్యల చెరువుల వద్ద ఏరియేటర్స్ నడపడానికి డీజిల్ వినియోగం అధికమైందన్నారు. ప్రస్తుత డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కంపెనీలను జిల్లాకు సరఫరాను 10 శాతం పెంచాలని



ఆదేశించడం అయిందని ఆయన తెలిపారు ఎక్కడా బంకులు డ్రై అవుట్ కాకుండా చర్యలు తీసు కుంటున్నామన్నారు.వరి కోత యంత్రాలకు డీజిల్ ఇబ్బంది లేకుండా విలేజ్ అగ్రికల్చరల్ ఆఫీసర్ ధృవీకరణ పత్రం విధానాన్ని ప్రవేశపెట్టా మన్నారు రైతులు లేదా ఆపరేటర్లు వి ఏ ఓ ల వద్ద సంతకం తీసుకున్న పత్రాన్ని బంకులో చూపిస్తే ప్రాధాన్యత క్రమంలో డీజిల్ సరఫరా చేస్తా రన్నారు. జిల్లావ్యాప్తంగా పలు ?ప్రభుత్వ ప్రాజెక్టులు,వివిధ నిర్మాణ ప్రాజెక్టులకు ప్రత్యేక కేటాయింపులు చేయడ మై నదన్నారు అవసరమైన వారు జిల్లా సివిల్ సప్లై అధికారి వారిని సంప్రదించ వచ్చున న్నారు ?నిత్యావసర సేవలు సరుకులు రేషన్ షాపులకు తరలించే స్టేజ్-2 రవాణా వాహనాలకు ఎటువంటి అంత రాయం లేకుండా డీజిల్ సరఫరా చేయబడుతుందన్నారు.?ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయ డమైనదన్నారు.? డీజిల్ సరఫరాలో ఎక్కడైనా సమస్యలు ఎదురైనా లేదా అధిక ధరలకు విక్రయించినా ఫిర్యాదు చేసేందుకు జిల్లా యంత్రాంగం రెండు ప్రత్యేక నంబర్లను ఏర్పాటు చేసిం దన్నారు వాటి సెల్ 90599 20242, 94416 92275 లు ఉన్నాయన్నారు.?జిల్లా ప్రజలు, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రభు త్వం అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసు కుందని ఆ ప్రకటన ద్వారా జిల్లా కలెక్టర్ తెలియజేశారు.

## హైవే రోడ్డుకు అడ్డంగా అనధికార ఫ్లెక్సీ ఏర్పాటు- క్లిక్ మనిపించిన సిటిజన్ టైమ్స్

### వెంటనే స్పందించిన హైవే అధికారులు





**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 25**

అమలాపురం- బట్నవిల్లి వై. జంక్షన్ వద్ద హైవే రోడ్డుకు అడ్డంగా అనధికార ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వారం రోజులుగా వాహనదారులకు అడ్డుగా ఉన్న ఫ్లెక్సీ వలన వచ్చే పోయే వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ఇబ్బంది పడ్డారు. అందరూ చూసి పోయే వారే తప్ప ఎవరరూ పట్టించుకోలేదు. ఈ విషయమై సిటిజన్ టైమ్స్ అనధికార ఫ్లెక్సీ ఏర్పాటును క్లిక్ మనిపించి గ్రూపులో పెట్టడంతో హైవే అధికారులు వెంటనే స్పందించి వాహనదారులకు అడ్డంగా ఉన్న ఫ్లెక్సీ వెంటనే తొలగించారు. వాహనదారులకు ఏమైనా జరగరాని ప్రమాదం జరిగితే ఈ ఫ్లెక్సీ దారులు సమాధానం చెబుతార అని, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. గతంలో కూడా అన్య మతానికి సంబంధించి ఒక ఫ్లెక్సీ ఏర్పాటు చేసి, కాంక్రీట్ దిమ్మలతో ఇనుప రాడ్ లను హైవే పై పాతి, ఫ్లెక్సీ ఏర్పాటు చేసినప్పుడు వాటిని కూడా హైవే అధికారులు తొలగించారు. కాంక్రీట్ దిమ్మలతో ఏర్పాటు చేసిన రాడ్లు కూడా తొలగించడం గమనార్హం. మొత్తం మీద హైవే రోడ్డుకు అడ్డంగా ఉన్న ఫ్లెక్సీలను తొలగించడం పట్ల వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రకృతి వ్యవసాయం పై రెండోరోజు శిక్షణ

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 25**

గిద్దలూరు మండలం అంబవరం గ్రామం లో గ్రామ వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ సహాయకులు మరియు ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ న్యాచురల్ ఫార్మింగ్ సిబ్బందికి 2 వ రోజు ప్రకృతి వ్యవసాయ విధానాలు పై మండల వ్యవసాయ అధికారి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రెండోరోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర పర్యటనలో ఎ గ్రేడ్ విధానం, ఎటిఎం విధానం చూపించి, 19 రకాల విత్తనాలతో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ విత్తనాల కిట్లు,బ్రహ్మాస్త్రం, వివిధ రకాల కసాయల తయారీ, విత్తన గుళికలు తయారు చేయించడమైనది. రైతులకు వీటిపై అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీనివాస రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మాస్టర్ ట్రైనీ ఆనంద్ మరియు సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



# రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమమే లక్ష్యం

## న్యాయమైన సమస్య అయితే పరిష్కరించే బాధ్యత తనదేనని హామీ

**రాయి గూడెం:( సిటిజన్ టైమ్స్ ): ఏప్రియల్ :25**

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నదే ఈ ప్రజా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పాలేరు నియోజకవర్గంలో వినూత్నంగా చేపట్టిన 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని శనివారం రాయిగూడెం క్లస్టర్ పరిధిలో నిర్వహించారు. రాయిగూడెం, అజయ్‌తండా, చెరువుమాదారం, మంగాపురం తండా, అప్పలనరసింహపురం, బుద్ధారం, కట్టుకాచారం, కొంగర, రాజారాంపేట, భైరవునిపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలతో మంత్రి పొంగులేటి ముఖాముఖి భేటీ అయ్యారు.

**పారదర్శక పాలన - ప్రజల ముంగిటకే యంత్రాంగం**

గతంలో ప్రజలు తమ గోడు చెప్పుకోవడానికి సరైన వేదిక లేక ఇబ్బందులు పడ్డారని, కానీ నేడు అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు వింటున్నారని మంత్రి తెలిపారు. "ఇది కేవలం ఒక రోజు కార్యక్రమం కాదు, నిరంతరం జరిగే ప్రక్రియ. మీ కష్టాలను వినే చిత్తశు ద్ధి ఈ ప్రభుత్వానికి ఉంది కాబట్టే ధైర్యంగా మీ మధ్యకు రాగలుగుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. ప్రజా దర్బార్‌ను కేవలం సభలా కాకుండా, ప్రతి పంచాయతీకి ఒక క్లాస్‌రూమ్ కేటాయించి అధికారులను కూర్చోబెట్టడం ద్వారా సమస్యలను లోతుగా అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. స్పాట్‌లోనే పరిష్కరించే వీలున్న సమస్యలను వెంటనే తేల్చేయాలని, మిగిలిన వాటికి వారం, నెల, మూడు నెలల చొప్పున గడువు నిర్ణయించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. "రాజకీయాలు ఎన్నికల వరకే. గెలిచిన తర్వాత ప్రభుత్వం అందరిది. అడిగిన పని న్యాయమైనదైతే, ప్రజలకు ఉపయోగపడేదైతే తప్పకుండా పూర్తి చేస్తాం"



అని మంత్రి వివరించారు. ఈ నియోజకవర్గంలో చేస్తున్న ఈ ప్రయోగం రేపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో అమలు చేయడానికి ఒక నమూనాగా నిలుస్తుందని ఆకాంక్షించారు. ఈనెల 27వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, హౌసింగ్ శాఖలపై కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి సమస్యలను పారదర్శకంగా, వడివడిగా పరిష్కరించి ప్రజలకు మేలు చేకూరుస్తామని హామీ ఇచ్చారు. "మీరు మనస్ఫూర్తిగా ఆశీర్వదించి నన్ను గెలిపించారు. మీ ఇంటి పెద్ద కొడుకుగా మీ కష్టాలను తీర్చాల్సిన బాధ్యత నాపై ఉంది. అసాధ్యమైన హామీలు నేను ఇవ్వను కానీ.. మీరు అడిగే సమస్య న్యాయమైనదైతే దాన్ని పూర్తి చేసే బాధ్యత నాది" అని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు.

# జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి..

భయాందోళనలు అవసరం లేదు పెట్రోల్ బంక్‌ల వద్ద సరఫరా యథావిధిగా కొనసాగుతుంది..

-అపోహలకులోనై అవసరానికి మించి ఇంధనం కొనుగోలు చేయకండి..

-బ్లాక్ మార్కెట్ లో ఇంధనం అమ్మకాలు నిర్వహించే వారిపై 6ఏ కింద కేసులు నమోదు..




**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 25**

జిల్లాలో ఇంధన కొరతపై వస్తున్న ప్రచారం అవాస్తవమని..అపోహలు నమ్మి వినియోగదారులు ఎవరు ఆందోళనకు గురి కావలసిన పనిలేదని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లాలో పెట్రోల్, డిజిల్ నిల్వలపై శనివారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్.. జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్‌ఎస్‌ఎస్ సత్యనారాయణ రాజుతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని పెట్రోల్ బంక్‌లలో పెట్రోల్, డీజిల్ నిల్వలు తగినంతగా ఉన్నాయని, సరఫరా యథావిధిగా కొనసాగుతోందన్నారు. అసత్య ప్రచారాలు, తప్పుడు సమాచారాన్ని వినియోగదారులు ఎవరు భయాందోళన చందాల్సిన పనిలేదని ఆయన స్పష్టం చేశారు. కాకినాడ జిల్లాలోని రిటైల్ అవుట్‌లెట్లలో పెట్రోల్, డీజిల్ తగినంత నిల్వలు ఉండేలా చూసి, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడానికి, జిల్లా స్థాయిలో పర్యవేక్షణను స్పష్టంగా ఉంచడానికి కచ్చితమైన సమాచారాన్ని అందించడానికి జిల్లా యంత్రాంగం అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ

**- జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**

ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న 160 పెట్రోల్ బంకుల వద్ద మండల స్థాయి అధికారులను నియమించి, నిల్వల లభ్యత, అమ్మకాలను నిత్యం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.వీరి ద్వారా భయాందోళనలతో ఇంధన కొనుగోళ్లను నియంత్రణ చెప్పడం జరుగుతుందన్నారు.దీనిపై ప్రతిరోజూ నివేదిక ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. శు క్రవారం తాను వ్యక్తిగతంగా కాకినాడ పట్టణంలోని వెంకట రమణ ఏజెన్సీస్ (హెచ్పీసీఎల్), శ్రీనివాస ఆటోకేర్ (ఐఓసీఎల్) మరియు బీపీ కాకినాడ (బీపీసీఎల్) అవుట్‌లెట్లలోని పెట్రోల్ బంకులను సందర్శించి, స్టాక్,అమ్మకాలు, సగటు అమ్మకాలు మొదలైనవాటిని తనిఖీ చేయడం జరిగిందన్నారు. గత 4 సంవత్సరాలుగా పెట్రోల్ డీజిల్ ధరల స్థిరంగానే ఉన్నాయని ఇప్పటివరకు ప్రభుత్వం డీజిల్ / పెట్రోల్ ధరల పెంపుపై ఎటువంటి ప్రకటన చేయలేదన జేసీ తెలిపారు. హెచ్పీసీఎల్, బిపిసిఎల్, ఐఓసీఎల్, నయారా, రిలయన్స్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులకు సగటు అమ్మకాల ప్రకారం అవసరమైన మేరకు స్టాక్‌లను నిరంతరాయంగా సరఫరా చేయాలన్నారు. ప్రైమరీ సెక్టర్, వినియోగదారులకు ఎటువంటి అంతరాయం లేకుండా పెట్రోల్ సరఫరా చేయాలని డీలర్లందరికీ ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ప్రజలు భయాందోళనలకు గురై అవసరమైన దానికంటే ఎక్కువ ఇంధనాన్ని కొనుగోలు చేయవద్దని జేసీ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అగ్ని ప్రమాదాల నివారించేందుకు బాటిళు ,, క్యాన్లు వంటి లూజ్ కంటెయినర్లలో ఇంధన విక్రయాలను పూర్తిగా నిషేధించామన్నారు.కాకినాడ, పెద్దాపురం డివిజన్లలోని పౌరసరఫరాలు,లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ ట్యాక్స్ , ట్రాన్స్‌పోర్ట్ శాఖల అధికారులతో కూడిన జాయింట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు జిల్లాలోని ఇంధన రిటైల్ అవుట్‌లెట్లను తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఎవరి వద్ద అయినా అక్రమ నిల్వలు,బ్లాక్ మార్కెట్ అమ్మకాలు జరిగినట్లు గుర్తిస్తే అటువంటి వారిపై వెంటనే 6ఎ కింద కేసులు బుక్ చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జేసీ హెచ్చరించారు.

## కలెక్టర్‌చే ఉత్తమ పంచాయతీరాజ్ సేవా పురస్కారం అందుకున్న ఎంపీడీవో కృష్ణ ప్రసాద్



**ఉప్పలగుప్తం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 25**

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం పురష్కరించుకుని అమలాపురంలో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ చేతుల మీదుగా ఉప్పలగుప్తం ఎంపిడిఒ డి. కృష్ట ప్రసాద్ సేవా పురష్కారాన్ని అందుకున్నారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణ రోడ్లు,డ్రైనేజీ, తాగునీరు, వీధిలైట్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ఈ గ్రామపంచాయతీ చేసిన కృషి గాను ఈ పురస్కారం ఆయనకు దక్కింది. ఈసందర్భంగా పలువురు నాయకులు ఎంపిటిసిలు తాజా మాజీ సర్పంచులు హర్షం వ్యక్త పరిచారు. ఆయనను కలసి అభినందనలు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ





**అంబాజీపేట సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 25**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అంబాజీపేట మండలం ముక్కామల సొసైటీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముక్కామల సొసైటీ వద్ద కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20,000 పెట్టుబడి సాయం అందిస్తున్నదని, చివరి గింజ వరకు ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తుందని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు 24 గంటలలోనే రైతుల ఖాతాల్లో జమ అవుతాయని ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో అయితే ధాన్యం అమ్మిన తర్వాత కూడా రైతులకు ఆరు నెలల వరకు డబ్బులు అందేవి కాదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతుల పక్షాన పనిచేస్తూ వేగంగా చెల్లింపులు చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పిఎసిఎస్ చైర్మన్లు, నీటి సంఘాల అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్లు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకట రెడ్డికి నివాళులు ముత్తుముల క్రిష్ణ కిశోర్

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 25**

గిద్దలూరు పట్టణంలోని పి ఆర్ కాలనీ లో దప్పిలి వెంకట రెడ్డి అనారోగ్యం కారణంగా మరణించిన విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి నివాసం వెళ్లి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.




# ఆరోగ్యం

## నల్లద్రాక్ష... స్త్రీల ఆరోగ్యానికి రక్ష



పుల్లగా, తీయగా ఉండే ద్రాక్షలో పోషకాలు ఎక్కువే. అందులోనూ నల్లద్రాక్షలో మహిళలకు మేలు చేసే సుగుణాలెన్నో! మరి వాటి గురించి తెలుసుకుందామా... నల్లద్రాక్ష ముందస్తు వృద్ధాప్య ఛాయల్ని అదుపులో ఉంచుతుందట. ముఖ్యంగా కొలాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో చర్మం తాజాగా మెరిసిపోతుంది. ఈ పండ్లలో ఉండే రెస్వెరాట్రాల్ సహజ ఈస్ట్రోజన్‌లా పనిచేసి హార్మోన్ల అసమతుల్యత రాకుండా చేస్తుంది. వేడిఆవిర్లు, మూడ్ స్వింగ్స్ వంటి వాటిని అదుపులో ఉంచుతుంది. ఎముక బలాన్ని కాపాడుతుంది. రెస్వెరాట్రాల్, పాలీఫెనాల్స్ నల్లద్రాక్షలో మెండుగా ఉంటాయి. ఇవి శరీరంలో రొమ్ముక్యాన్సర్ కణాల పెరుగుదలను అడ్డుకుంటాయి. దీంతో ఆ ముప్పు తగ్గుతుంది. మెనోపాజ్ తర్వాత మహిళలు గుండెజబ్బుల బారిన పడుతుంటారు. నల్లద్రాక్షలో ఉండే ఫైటోకెమికల్స్ చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి కండరాలకు మేలుచేస్తాయి. రక్తపోటు అదుపులో ఉండటమే కాదు... గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. బరువు తగ్గాలనుకునేవారు ఈ పండ్లను తీసుకుంటే సరి. వీటిలోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని వ్యర్థాలను తొలగించి, బరువు తగ్గించేందుకు కారణం అవుతాయి.

## అందానికి పిల్లో మంత్ర..



ముఖం అందంగా కనిపించాలని తినే ఆహారం దగ్గర నుంచి రాసుకునే క్రీమ్ వరకూ ప్రతి విషయంలోనూ ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు అమ్మాయిలు. కానీ, ముఖంపై మొటిమలు, ముడతలు, గీతలకి మనం రోజూ నిద్రపోయే తలగడ కూడా కారణం అంటున్నాయి అధ్యయనాలు. ఇవి మనకు తెలియకుండానే వృద్ధాప్యాన్ని తెచ్చిపెడుతున్నాయట. మరి దీన్నుంచి రక్షణ పొందాలంటే... ఈ జాగ్రత్తలు పాటించాలి. నిద్రలో ఉన్నప్పుడు కొంతమంది ఒక వైపు తిరిగి నిద్రపోడం, లేదా బోర్లా పడుకోవడం చేస్తారు. దీనివల్ల ముఖంపై ఒత్తిడి పడుతుంది. దాంతో గీతలు ఏర్పడి క్రమంగా అవి ముడతలుగా మారేందుకు ఆస్కారం ఉంది. అంతేకాదు, కొల్లాజెన్ ఉత్పత్తి తగ్గుతుంది. అలసటను దూరం చేసుకోవడానికి నిద్రపోతాం. పక్క సరిగ్గా ఉందా, ఫ్యాన్ తిరుగుతుందా అని చూస్తాం. వీటితోపాటూ తలకింద ఉండే దిండు శుభ్రంగా ఉందా అనేదీ గమనించుకోవాలి. ఎందుకంటే... రాత్రి సమయంలో మన చర్మంపై ఉండే మృతకణాలు, నూనెలు, మేకప్ అవశేషాలు పిల్లో మీదకే వచ్చి చేరతాయి. వీటికి బ్యాక్టీరియా తోడై అలర్జీలకూ దారి తీస్తాయి. అందుకే రోజుకోసారైనా దిండులోని దుమ్ము పోయేలా దులపాలి. చర్మంలోని సహజ నూనెలను దిండ్లు పీల్చేస్తాయి. దీంతో చర్మం పొడిబారుతుంది. అందుకే వీటి ఎంపికలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. కాటన్ లేదా శాటిన్ రకాలను ఎంచుకుంటే మంచిది. ఇవి ఒత్తిడి తగ్గించి, నూనెలను పీల్చుకోకుండా కొంతవరకూ అడ్డుకుంటాయి. అంతేకాదు, వారానికోసారి గలేబులను మార్చాలి. గోరువెచ్చని నీటిలో రసాయనాలు లేని డిటర్జెంట్లతో ఉతకాలి. కనీసం నెలకోసారైనా పిల్లోలను ఎండలో ఉంచాలి. వాటిలో దుమ్ము చేరకుండా ఉండేందుకు యాంటీ రింకిల్ పిల్లోలు, ప్రొటెక్టర్లూ, హైపోఅలర్జెనిక్ పిల్లో కవర్లను వాడాలి. మూడేళ్లకోసారి దిండ్లు మారుస్తూ ఉండాలి. వీటితోపాటు వెల్లకిలా పడుకోవడం అలవాటు చేసుకోవాలి. రాత్రి సమయంలో చర్మం తేమను కోల్పోకుండా మాయిశ్చరైజర్ రాయాలి. అలాగే గది ఉష్ణోగ్రతలు తగ్గకుండానూ చూసుకోవాలి.



## చలికాలానికి... చిలగడ దుంప...

చలికాలం వచ్చిందంటే ఆలస్యంగా నిద్రలేవడం, బద్ధకంగా ఉండటం, ఆకలి తగ్గడం వంటివి కనిపిస్తాయి. అంతేకాదు, బయట పడిపోతున్న ఉష్ణోగ్రతల నుంచి మనల్ని వెచ్చగా ఉంచడానికి మన శరీరం ఎక్కువ శక్తినీ ఖర్చు చేస్తుంది. దాంతో రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. చలికాలం వచ్చిందంటే ఆలస్యంగా నిద్రలేవడం, బద్ధకంగా ఉండటం, ఆకలి తగ్గడం వంటివి కనిపిస్తాయి. అంతేకాదు, బయట పడిపోతున్న ఉష్ణోగ్రతల నుంచి మనల్ని వెచ్చగా ఉంచడానికి మన శరీరం ఎక్కువ శక్తినీ ఖర్చు చేస్తుంది. దాంతో రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. అందుకే మనం తినే ఆహారం మన శక్తిస్థాయుల్ని పెంచాలి. జీర్ణక్రియను మెరుగుపరిచి, సీజనల్ ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడేదిగా ఉండాలి. ఇందుకు చిలగడ దుంప మంచి ఎంపిక. దీంతో చాలా ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. చిలగడ దుంపలో విటమిన్ ఎ, సి, బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శ్వాసకోశ గోడలకు రక్షణ కల్పించి వైరల్ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తాయి. దీనిలో ఉండే కార్బోహైడ్రేట్లు మన శరీరానికి కావాల్సిన శక్తిని నెమ్మదిగా విడుదల చేస్తాయి. దాంతో శీతకాలంలో వచ్చే అలసటను దూరం చేసి చురుకుగా ఉండేందుకు సహకరిస్తాయి. వాతావరణం చల్లగా ఉందని నీరు తక్కువగా తాగుతాం. దాంతో చర్మం పొడి బారుతుంది. అయితే ఇందులో ఎక్కువగా ఉండే నీటిశాతం వల్ల శరీరం డీహైడ్రేషన్‌కి గురికాదు. చిలగడదుంపలో ఉండే పీచుపదార్థం జీర్ణక్రియను పెంచుతుంది. పేగులో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేసి గట్‌హెల్త్‌ను ప్రోత్సహిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు, ఆంథోసైనిన్లు సమృద్ధిగా ఉండే స్వీట్ పొటాటో వృద్ధాప్య ఛాయల్నీ తగ్గిస్తుంది. చర్మాన్ని మృదువుగా చేసి, సహజ మెరుపునిస్తుంది. అందుకే దీన్ని, సూప్‌చేసి లేదా ఉడికించి చిరుతిండిగా తీసుకుంటే మంచిది.

## రోజుకో పూట చపాతీ తినాలట



బరువు తగ్గాలనుకునే వారు ప్రతి విషయంలోనూ ప్రత్యామ్నాయాల్ని వెతుక్కుంటుంటారు. రాత్రుళ్లు అన్నం మానేసి చపాతీ తీసుకోవడం కూడా ఇలాంటిదే! అయితే రాత్రి భోజనంలో చపాతీని భాగం చేసుకోవడం వల్ల బరువు తగ్గడంతో పాటు మరెన్నో ఆరోగ్య ప్రయోజనాల్ని సొంతం చేసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. బరువు తగ్గాలనుకునే వారు ప్రతి విషయంలోనూ ప్రత్యామ్నాయాల్ని వెతుక్కుంటుంటారు. రాత్రుళ్లు అన్నం మానేసి చపాతీ తీసుకోవడం కూడా ఇలాంటిదే! అయితే రాత్రి భోజనంలో చపాతీని భాగం చేసుకోవడం వల్ల బరువు తగ్గడంతో పాటు మరెన్నో ఆరోగ్య ప్రయోజనాల్ని సొంతం చేసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. మరి, చపాతీలో దాగున్న ఆ ఆరోగ్య రహస్యాలేంటో తెలుసుకుందాం రండి..

**పోషకాల సమ్మేళనం!**

చపాతీని పోషకాల సమ్మేళనంగా పేర్కొంటున్నారు నిపుణులు. ఇందులో 'బి', 'ఇ' విటమిన్లతో పాటు కాపర్, జింక్, అయోడిన్, మాంగనీస్, సిలికాన్, పొటాషియం, క్యాల్షియం.. వంటి ఖనిజాలు లభిస్తాయి. అంటే.. ఇవన్నీ రోజువారీ శరీరానికి కావాల్సిన పోషకాలను కొద్ది మొత్తాల్లో భర్తీ చేస్తాయన్నమాట! చపాతీలో ఉండే సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు శరీరానికి శక్తిని అందిస్తాయి. తద్వారా రోజంతా ఉత్సాహంగా ఉండచ్చు. చపాతీల్లో ఉండే ఐరన్ స్థాయులు శరీరంలో హెమోగ్లోబిన్ స్థాయుల్ని క్రమబద్ధీకరిస్తాయి. చపాతీల్లో ఉండే జింక్, ఇతర ఖనిజాలు చర్మ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సహకరిస్తాయంటున్నారు నిపుణులు. ఇందులో ఉండే పీచు జీర్ణవ్యవస్థకూ మంచిదే! అజీర్తి, గ్యాస్, మలబద్ధకం.. వంటి జీర్ణ సంబంధిత సమస్యలున్న వారు నిపుణుల సలహా మేరకు రోజూ చపాతీని ఆహారంలో భాగం చేసుకోవడం ఉత్తమం. గుండె ఆరోగ్యానికీ చపాతీ మేలు చేస్తుందట! ఇందుకు దీనిలో అతి తక్కువ కొవ్వులుండడమే కారణమంటున్నారు నిపుణులు.

**ఇలా చేసుకోవాలట!**

చపాతీ ఆరోగ్యానికి మంచిదే కదా అని ఎక్కువ నూనె, నెయ్యితో చేసుకోవడం వల్ల శరీరంలో అనవసర కొవ్వులు చేరతాయంటున్నారు నిపుణులు. అందుకే వీలైనంత తక్కువ నెయ్యి/నూనెను వాడడం మంచిదంటున్నారు. అసలు ఈ రెండూ ఉపయోగించకుండా పుల్కా చేసుకొని తింటే మరీ మంచిదట! బయట దొరికే గోధుమపిండిలో మైదా కలిసే అవకాశం ఉంటుంది. కాబట్టి ముడిగోధుమలు తీసుకొని స్వయంగా పట్టించుకొని ఆ పిండితో చపాతీ చేసుకుంటే మంచిది. చపాతీకి జతగా రోజూ పప్పు, బంగాళాదుంప కర్రీ అని కాకుండా అన్ని రకాల కాయగూరలతో చేసిన కూరలు తీసుకోవడం వల్ల పోషకాలన్నీ శరీరానికి అందుతాయంటున్నారు నిపుణులు. బీన్స్, క్యారట్ ముక్కలు, పాలకూర.. వంటి వాటిని ఉడికించి.. గోధుమ పిండి కలిపేటప్పుడు అందులో వేసి చపాతీ చేసుకుంటే అటు రుచికి రుచి.. ఇటు ఆరోగ్యానికి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చట. గోధుమపిండికి రాగి పిండి, సోయాబీన్ పిండి, చిరుధాన్యాలతో తయారుచేసిన పిండి.. వంటివి కూడా కలుపుకొని చపాతీ తయారుచేసుకోవచ్చు. లేదంటే బయట దొరికే మల్టీగ్రెయిన్ పిండిని కూడా వాడుకోవచ్చు. అయితే అందులో మైదా 0%గా ఉండాలన్న విషయం గుర్తుపెట్టుకోండి. ఈ విషయం లేబుల్ చూస్తే అర్థమవుతుంది.

## అందానికీ క్యారెట్..

రోజంతా ఇంటి పనులు, ఉద్యోగం అంటూ పరుగులు పెట్టే మహిళలు తమ ఆరోగ్యాన్ని మాత్రం నిర్లక్ష్యం చేస్తుంటారు. మరి వారికి కావల్సిన పోషకాలన్నీ దొరికే క్యారెట్‌ను రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటే ఎన్ని ప్రయోజనాలు పొందొచ్చో తెలుసా? రోజంతా ఇంటి పనులు, ఉద్యోగం అంటూ పరుగులు పెట్టే మహిళలు తమ ఆరోగ్యాన్ని మాత్రం నిర్లక్ష్యం చేస్తుంటారు. మరి వారికి కావల్సిన పోషకాలన్నీ దొరికే క్యారెట్‌ను రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటే ఎన్ని ప్రయోజనాలు పొందొచ్చో తెలుసా? వయసు పెరిగే కొద్దీ ముఖంపై ముడతలు, గీతలు సాధారణమే, క్యారెట్ దీనికి మంచి పరిష్కారం. ఎ, కె, బి6 విటమిన్లతోపాటు బయోటిన్, మినరల్స్, బీటా కెరోటిన్‌లు దీనిలో ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మానికి సహజ టానిక్‌లా పనిచేస్తాయి. విటమిన్ ఎ చర్మం పొడిబారడాన్ని తగ్గిస్తే... ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు వృద్ధాప్య ఛాయల్ని రానివ్వకుండా కాపాడతాయి. ఉద్యోగరీత్యా కంప్యూటర్లు, ఫోన్లతో గడిపే సమయం పెరిగిపోయింది. దీంతో కంటి సమస్యలు పెరుగుతున్నాయి. క్యారెట్‌లోని బీటా కెరోటిన్ మన శరీరంలోకి వెళ్లి విటమిన్-ఎగా మారుతుంది. ఇది కంటి చూపుని కాపాడుతుంది. బరువు తగ్గాలనుకునేవారికి ఇది మంచి ఎంపిక. దీనివల్ల ఆకలి తగ్గుతుంది. బరువు నియంత్రణలో ఉంటుంది. మహిళల్లో మెనోపాజ్ తరవాత గుండె సంబంధిత వ్యాధుల్నీ, రక్తపోటునీ నియంత్రిస్తుంది. ఇందులో ఉండే కెరోటినాయిడ్లు, ఫ్లేవనాయిడ్లు ఆరోగ్యానికి చాలా మంచివి. యాంటీఆక్సిడెంట్లు, పొటాషియం మెదడు, గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. రక్తపోటుని అదుపులో ఉంచుతాయి. ఒత్తిడిని దూరం చేస్తాయి. టాక్సిన్లను బయటకు పంపి కాలేయాన్ని శుభ్రపరుస్తాయి. అందుకే సలాడ్, కూర, సూప్, జ్యూస్‌ల రూపంలో క్యారెట్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యం మన సొంతం.



# స్టన్నింగ్ లుక్‌లో మెరిసిన నోరా ఫతేహి



కృతి శెట్టి గోల్డ్ గౌన్‌లో సొగసైన స్టూడియో లుక్‌తో స్టన్ చేసింది



బాలీవుడ్ డ్యాన్సింగ్ సెన్సేషన్ నోరా ఫతేహి తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు నెట్టింట హల్చల్ చేస్తున్నాయి. తన అద్భుతమైన డ్యాన్స్ మూవ్స్‌తోనే కాకుండా, బోల్డ్ అండ్ గ్లామరస్ ఫ్యాషన్ సెన్స్‌తో కూడా నోరా ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటుంది. ఈసారి బ్లాక్ కలర్ షార్ట్ డ్రెస్సులో ఆమె ఇచ్చిన స్టైలిష్ పోజులు అభిమానులను ఫిదా చేస్తున్నాయి. అందానికే అందం అనేంతగా ఆమె ఈ ఫొటోల్లో మెరిసిపోతోంది.నోరా ఫతేహి తాజాగా పోస్ట్ చేసిన ఫోటోలు చూస్తుంటే, ఆమె అందం మునుపటి కంటే రెట్టింపు అయినట్లు అనిపిస్తోంది. బ్లాక్ కలర్ డారెన్ షార్ట్ డ్రెస్సులో ఆమె అత్యంత ఆకర్షణీయంగా కనిపించింది. ఆ డ్రెస్సుపై ఉన్న స్టైలిష్ జాకెట్, దానికి తగ్గట్టుగా వేసుకున్న చైన్ నెక్లెస్ ఆమె లుక్‌ను మరింత ఎలివేట్ చేశాయి. కుర్చీపై కూర్చుని ఆమె ఇచ్చిన బోల్డ్ అండ్ గ్లామరస్ పోజులు కుర్రకారును కట్టిపడేస్తున్నాయి. ఈ ఫోటోషూట్ ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్‌గా మారింది.నోరా ఫతేహి అనగానే అందరికీ ముందుగా గుర్తొచ్చేది ఆమె అదిరే డ్యాన్స్ మూవ్స్. కానీ, కేవలం డ్యాన్స్ మాత్రమే కాదు, ఫ్యాషన్ ప్రపంచంలోనూ ఆమె తనదైన ముద్ర వేసింది. తరచుగా ట్రెండీ అవుట్‌ఫిట్స్, టైట్ ఫిట్టింగ్ దుస్తులలో, ముఖ్యంగా బోల్డ్ బ్లాక్ డ్రెస్సులలో ఫోటోలను పంచుకుంటూ వైరల్ అవుతుంటారు. ఇక ఆమె ఫ్యాషన్ సెన్స్ ఎప్పుడూ కొత్తగా, స్టైలిష్‌గా ఉంటుంది. అందుకే ఫ్యాషన్ ప్రియులు కూడా ఆమెను ఫాలో అవుతుంటారు.నోరా ఫతేహి తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా పరిచయం. 'బాహుబలి' చిత్రంలోని 'మనోహరి' పాటతో ఆమె తెలుగులో భారీ పాపులారిటీ సంపాదించుకున్నారు. ఆ పాటలో ఆమె చూపిన అందచందాలు, డ్యాన్స్ మూవ్స్ ఇప్పటికీ ప్రేక్షకుల మనస్సుల్లో నిలిచిపోయాయి. అలాగే 'టెంపర్' వంటి చిత్రాలలో కూడా ఐటెం సాంగ్స్‌తో అలరించారు. ఇక తెలుగులో ఆమెకు ఉన్న క్రేజ్ కారణంగా, ఆమె పెట్టే ప్రతి పోస్ట్ కూడా ఇక్కడా వైరల్ అవుతూ ఉంటుంది.నోరా పర్ఫెక్ట్ ఫిగర్ మరియు మెరిసే చర్మం ఎప్పుడూ చర్చనీయాంశమవుతుంటాయి. దీని వెనుక ఆమె చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. సమాచారం ప్రకారం, నోరా తన చర్మ సంరక్షణలో మొరాకన్ ఉత్పత్తులను, ముఖ్యంగా '×ఓఅశ్రీ' బ్రాండ్ ను ఇష్టపడతారు. అలాగే, స్కిన్ టైటనింగ్ కోసం లేజర్ పరికరాలను కూడా ఉపయోగిస్తారని అంటుంటారు. ఇక ఆమె ఫిట్‌నెస్ ఫ్రీక్ అని, రోజూ కఠినమైన వ్యాయామాలు చేస్తారని తెలుస్తోంది. ఈ క్రమశిక్షణే ఆమెను ఇంత గ్లామరస్‌గా ఉంచుతోంది.మొత్తానికి, నోరా ఫతేహి తాజా ఫోటోషూట్‌తో మరోసారి తన గ్లామర్ పవర్ చూపించారు. డ్యాన్స్, ఫ్యాషన్ రెండింటిలోనూ అదరగొడుతూ, ఆమె కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తోంది. ఆమె రాబోయే ప్రాజెక్టుల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



రాశి సింగ్ అద్భుతమైన చీర పోజ్ మరియు బోల్డ్ స్టైల్‌తో తల తిప్పింది

## కేఎల్ రాహుల్ నయా రికార్డ్.. ఐపీఎల్ చరిత్రలో 150 రన్స్ చేసిన తొలి భారతీయుడు



అరుణ్ జైట్లీ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ కేఎల్ రాహుల్ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. కేవలం 67 బంతుల్లోనే 152 పరుగులు (నాటౌట్) చేసి, ఐపీఎల్ చరిత్రలో సరికొత్త మైలురాయిని చేరుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో 150 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేసిన మొదటి భారతీయ ఆటగాడిగా రాహుల్ రికార్డు సృష్టించాడు. ఐపీఎల్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో (6 సెంచరీలు) క్రిస్ గేల్ సరసన నిలిచాడు.

**రికార్డుల వేట:**

తొలి భారతీయ వీరుడు: ఐపీఎల్ చరిత్రలో 150 పరుగుల మైలురాయిని దాటిన మొట్టమొదటి భారతీయ బ్యాటర్‌గా రాహుల్ రికార్డు నెలకొల్పాడు.

అభిషేక్ శర్మ రికార్డు బ్రేక్: గత ఏడాది పంజాబ్ కింగ్స్‌పైనే అభిషేక్ శర్మ చేసిన 141 పరుగుల రికార్డును రాహుల్ ఈరోజు (2026, ఏప్రిల్ 25న) అధిగమించాడు. విశేషమేమిటంటే, అంతకుముందు 132 పరుగులతో రాహుల్ పేరిట ఉన్న రికార్డును అభిషేక్ బ్రేక్ చేయగా, ఇప్పుడు రాహుల్ మళ్ళీ తన స్థానాన్ని దక్కించుకున్నాడు.

దిగ్గజాల సరసన రాహుల్: ఐపీఎల్ చరిత్రలో 150ం పరుగులు చేసిన ముగ్గురు దిగ్గజాల జాబితాలో (క్రిస్ గేల్, బ్రెండన్ మెకల్లమ్ తర్వాత) రాహుల్ చేరాడు.

**ఢిల్లీ క్యాపిటల్స్ రికార్డ్:**

గతంలో రిషబ్ పంత్ (128ని) పేరిట ఉన్న ఢిల్లీ ఫ్రాంచైజీ అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును రాహుల్ అధిగమించాడు.

రెండో వికెట్‌కు రికార్డ్ భాగస్వామ్యం: నితీష్ రాణాతో కలిసి రెండో వికెట్‌కు 220 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పిన కేఎల్ రాహుల్

**ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోర్లు:**

ప్రస్తుతం కేఎల్ రాహుల్ సాధించిన 152ని పరుగులు ఐపీఎల్ చరిత్రలోనే మూడవ అత్యధిక వ్యక్తిగత స్కోరుగా నిలిచింది.

మొదటి స్థానంలో ఉన్న క్రిస్ గేల్ 2013లో పుణే వారియర్స్ పై 175 పరుగులతో నాటౌట్ గా నిలిచాడు.

రెండో స్థానంలో ఉన్న బ్రెండన్ మెకల్లమ్ 2008లో ఆర్‌సీబీపై 158 పరుగులతో నాటౌట్ గా నిలిచాడు.

మూడో స్థానంలో నిలిచిన కేఎల్ రాహుల్ 2026లో పంజాబ్ కింగ్స్ పై 152 పరుగులతో నాటౌట్ గా అవతరించాడు.

ఆ తర్వాత అభిషేక్ శర్మ 141 పరుగులు, క్వింటన్ డి కాక్ 140 పరుగులతో నాటౌట్ గా నిలిచారు.

ఇక నితీష్ రాణాతో కలిసి పంజాబ్ బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టిన కేఎల్ రాహుల్, తన ఐపీఎల్ కెరీర్‌లో 6వ సెంచరీని నమోదు చేశాడు. రాహుల్ విధ్వంసంతో ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 264 పరుగుల భారీ స్కోరును సాధించింది. అయితే కేఎల్ రాహుల్ ఆడిన ఈ చారిత్రాత్మక ఇన్నింగ్స్ సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతోంది. ముఖ్యంగా పంజాబ్ జట్టుపైనే అతను ఈ ఘనత సాధించడం విశేషం.


## 265 ఉఫ్.. పంజాబ్ కింగ్స్ రికార్డు ఛేదన



ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఇప్పటివరకు ఈ సీజన్‌లో ఓటమి ఎరుగని ఆ జట్టు ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో గెలిచింది. ప్రత్యర్థి 265 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించినా.. ఏ మాత్రం బెదరకుండా 7 బంతులు మిగిలుండగానే టార్గెట్‌ను పూర్తి చేసింది. ఐపీఎల్ చరిత్రలో ఇదే రికార్డు ఛేదన. అంతకుముందు కూడా ఈ రికార్డు పంజాబ్ పేరిటే ఉంది. 2024లో కోల్‌కతా నిర్దేశించిన 262 టార్గెట్‌ని పంజాబ్ ఛేజ్ చేసింది.

కేఎల్ రాహుల్ (152 నాటౌట్; 67 బంతుల్లో 16 ఫోర్లు, 9 సిక్సులు) విధ్వంసకర సెంచరీతో విరుచుకుపడటంతో తొలుత ఢిల్లీ 2 వికెట్లు కోల్పోయి 264 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ లక్ష్యాన్ని పంజాబ్ ఛేదించింది. తాజా మ్యాచ్‌లో పంజాబ్ ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్ సింగ్ (76; 26 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్సులు), ప్రియాంశ్ ఆర్య (43; 17 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సులు) అదిరే ఆరంభం ఇవ్వడంతో పవర్ ప్లే ముగిసేసరికి జట్టు 116/0తో నిలిచింది. తర్వాత వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (71ని; 36 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సులు) దూకుడు కొనసాగించి జట్టును విజయతీరాలకు చేర్చాడు.

## వరుణ్ భాయ్ వచ్చాకనే.. నా లైఫ్‌లో గొప్ప మార్పు: ప్రఫుల్ హింగే



ఒకే ఓవర్‌లో మూడు వికెట్లు.. అదీనూ డేంజరస్ బ్యాటర్లను ఔట్ చేయడం సాధారణ విషయం కాదు. అరుదుగా జరిగే ఈ ఫీట్‌ను ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్ ప్రఫుల్ హింగే రాజస్థాన్ రాయల్స్‌పై సాధించిన సంగతి తెలిసిందే. ఇవాళ మరోసారి ఇరుజట్ల మధ్య జైపూర్ వేదికగా మ్యాచ్ జరగనుంది. ఈ క్రమంలో ప్రఫుల్ హింగే సంభాషించిన ఓ వీడియోను స్టార్ స్పోర్ట్స్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. వరుణ్ ఆరోన్ వల్లే తాను మళ్లీ పుంజుకోగలిగినట్లు వెల్లడించాడు. 2022లో గాయం కారణంగా ఏం చేయాలో కూడా అర్థం కాలేదని.. ఎక్కడికీ వెళ్లలేకపోయినట్లు గుర్తు చేసుకున్నాడు.

"తీవ్ర గాయం కావడంతో చాలా ఆందోళనకు గురయ్యా. ఏం చేయాలో తోచలేదు. చీకటి ఆవహించినట్లు అనిపించింది. ఎక్కడికీ వెళ్లలేకపోయా. కనీసం స్వేచ్ఛగా నడవలేకపోయా. కొన్నిరోజుల తర్వాత.. ఈ సమయాన్ని సాధ్యమైనంతవరకూ సద్వినియోగం చేసుకోవాలని భావించా. ఎప్పుడైతే టీమ్ఇండియా మాజీ పేసర్ వరుణ్ ఆరోన్‌ను కలిశానో.. నా జీవితంలో చాలా మార్పులు వచ్చాయి. తమ కెరీర్‌లోనూ ఇలాంటి దశను అనుభవించి వచ్చినట్లు మోటివేట్ చేశారు. కొన్నాళ్లు హాయిగా విశ్రాంతి తీసుకో.. ఆటను చూస్తూ ఆస్వాదించు అని హితబోధ చేశారు. అప్పుడు నాలో కాన్ఫిడెన్స్ పెరిగింది. గాయం నుంచి కోలుకున్నాక.. కఠినంగా శ్రమించడంపై దృష్టిపెట్టా. ఎంఆర్ఎఫ్ అకాడమీలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బౌలర్లతో కలిసి ఆడే అవకాశం వచ్చింది. నా ఆట స్థాయి ఏంటి? నేను ఎక్కడ మెరుగుకావాలనే దానిపై ఓ అవగాహన వచ్చింది. ఆస్ట్రేలియాకు వెళ్లడమూ సాయపడింది. అక్కడి భిన్నమైన పిచ్‌లపై ఎలా బౌలింగ్ చేయాలో అనుభవం వచ్చింది. చాలా విలువైన ఎక్స్‌పీరియన్స్ అది" అని హింగే వెల్లడించాడు.

**కొత్త బంతితో బ్యాటర్లకు పరీక్ష పెట్టడం..**

"ఎర్ర బంతితో ఆడటం చాలా సాయం చేసింది. ఓపికగా, లైన్ అండ్ లెంగ్త్‌కు కట్టుబడి నిలకడగా ఎలా బౌలింగ్ చేయొచ్చనేది ఇక్కడ అలవడుతుంది. కొత్త బంతితో బ్యాటర్లకు పరీక్ష పెట్టడమే నా ప్రణాళిక. సుదీర్ఘ ఫార్మాట్‌లో నేను అనుసరించే ప్రాథమిక సూత్రమదే. దానినే టీ20ల్లోనూ అమలుచేస్తుంటా. ఎస్ఆర్‌హెచ్ తరఫున దూకుడుగా ఆడే బ్యాటర్లు ఉన్నారు. నెట్స్‌లో వారికి బౌలింగ్ చేయడం కూడా కలిసొచ్చింది. హార్డ్ హిట్టర్లు ఎలా షాట్లు కొట్టేందుకు ప్రయత్నిస్తారనే దానిపై అవగాహన వచ్చింది. ఇప్పుడు మా లక్ష్యం ట్రోఫీని నెగ్గడం. అందుకోసం మరీ ఎక్కువగా ఆలోచించడం లేదు. ఒక్కో మ్యాచ్‌లో గెలుపుపై దృష్టిపెడుతున్నాం. నాణ్యమైన ప్రదర్శనతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించడమే నా వంతు" అని హింగే తెలిపాడు.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776